

దంచి కొట్టిన వాన
పొంగిన వాగులు
(7లో...)

కలెక్టర్‌గా శ్యామ్‌ప్రసాద్

● టీఎస్ చేతన్ బదిలీ




జిల్లా నూతన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పుట్టపర్తి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా శ్యామ్‌ప్రసాద్ నియమితుడయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ శ్యామ్‌ప్రసాద్ గతేడాది జూలై 7న పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయనను తాజాగా జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేస్తున్న టీఎస్ చేతన్‌ను బదిలీ చేశారు. ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. టీఎస్ చేతన్ గతేడాది జూలై 10న కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 14 నెలలు పనిచేశారు. జిల్లాపై తనదైన ముద్ర వేశారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

కరెంటోళ్ల మొద్దునిద్ర..!





> విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది మొద్దు నిద్రలో ఉన్నారు. విద్యుత్ లైన్ కిందపడి పోయి ఓ మూగజీవి చనిపోయి.. రోజులు గడుస్తున్నా.. పట్టించుకోరు. వైర్లను అలాగే నేలపైనే వదిలేశారు. విద్యుత్ స్తంభం కూలి పోయినా.. కొత్తది ఏర్పాటు చేయరు. కొత్త స్తంభం పెట్టాలంటే.. ఇంటికింత ఇచ్చుకోవాలంటూ డిమాండ్లు పెడుతున్నారట. విద్యుత్ లైన్లను తాళ్లతో కట్టి, మిద్దెలపైనే పడేశారు. వర్షం వస్తే.. ఇళ్లు మొత్తం షాక్ కొడుతోందని ప్రాణభయంతో ప్రజలు వేడుకుంటున్నా.. జనం ప్రాణాలే కదా.. పోతే పోనీలే అనుకున్నారో.. ఏమో.. అస్సలు పట్టించుకోవట్లేదు. దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

● స్తంభం కూలినా కొత్తది ఏర్పాటు చేయరు ● ప్రాణాలు పోయినా మరమ్మతులు చేయరు

నంబులపూలకుంట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారులు.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రమాదం జరిగినపుడు హడావుడి చేసి, పరిష్కరిస్తామని చెబుతారే తప్ప.. తరువాత పట్టించుకోరని ప్రజలు వాపోతున్నారు. పదిరోజుల వ్యవధిలోనే రెండు ప్రమాదాలు జరిగాయి. వెంటనే పరిష్కరిస్తామన్నారే తప్ప.. ఏమాత్రం చర్యలు చేపట్టలేదని ప్రజలు మండిపడుతున్నారు. మండల కేంద్రానికి సమీపంలోని దేవరచెరువు వద్ద కిందపడిన విద్యుత్ వైర్లను తాకడంతో పాడి ఆవు మృతిచెందింది. రూ.లక్షకుపైగా రైతుకు నష్టం వాటిల్లింది. నేటికీ కనీసం విద్యుత్ లైన్‌కు మరమ్మతులు కూడా చేయలేదు. మండలంలోని జౌకల గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం ఉన్నఫలంగా ఓ ఇంటిపై పడిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ స్తంభాన్ని తొలగించారు. విద్యుత్ సరఫరా చేసేందుకు ఓ ఇంటిపై గల దిమ్మెకు విద్యుత్ వైర్లను చుట్టి, తాత్కాలిక పనులతో చేతులు దులుపుకున్నారు. చిరుజల్లులు కురిస్తే చాలు ఆ ఇంటికి విద్యుత్ సరఫరా అవుతోంది. ఆ ఇంటిపైకి ఎక్కాలంటే భయాందోళన చెందుతున్నారు. నూతన విద్యుత్ స్తంభం తెచ్చారే తప్ప.. ఏర్పాటు చేయట్లేదు. ఆ స్తంభం నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకున్నవారు పైసలు ముట్టజెబితేనే స్తంభం ఏర్పాటు చేస్తామని డిమాండ్ చేస్తున్నారట. ప్రాణాలు పోతుంటే.. కరెంటోళ్లకు కాసులు కావాలా.. అంటూ జనం మండిపడుతున్నారు.



ఫొటోను చూసి.. ఇదేదో.. దుస్తులు ఆరబెట్టుకునేందుకు ఇంటిపై కట్టుకున్న తీగ అనుకుంటే పొరబాటే. అచ్చంగా ఇది విద్యుత్ లైన్. అది కూడా ఇంటికి సరఫరా చేసేది కాదు. ఊరంతటికీ విద్యుత్ సరఫరా చేసే లైన్. నంబులపూలకుంట మండలం జౌకల గ్రామంలో ఇటీవల విద్యుత్ స్తంభం కూలిపోవడంతో లైన్‌ను ఇలా.. ఇంటి మీద పడేశారు కరెంటోళ్లు. వర్షం వస్తే గోడలు షాక్ కొడుతున్నాయని ఇంట్లో ఉంటున్న వారు చెబుతున్నా.. పట్టించుకునేవారు లేరు.



ఇంటి మీద పడిన విద్యుత్ స్తంభం ← (ఫైల్)

● ఇళ్లపైనే, అందే ఎత్తులోనే విద్యుత్ తీగలు
● ప్రజలకు నిత్యం ప్రాణగండం

నేలపైనే తీగలు..

దేవచెరువు గ్రామానికి చెందిన రైతు అనిల్‌కుమార్‌నాయుడు ఇటీవల తన పాడి ఆవును సొంత పొలం వద్దకు మేపు కోసం తోలుకెళ్తుండగా.. నేలపై పడిన విద్యుత్ లైన్‌ను తాకి ఆవు మరణించింది. వెంటనే అక్కడికి చేరుకున్న విద్యుత్ అధికారులు లైన్‌కు మరమ్మతులు చేపడతామనీ, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చేస్తామని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత కనీసం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. విద్యుత్ వైర్లు నేలమీదే ఉన్నాయి. ఆ లైన్ గుండా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపి వేసినట్లు చెబుతున్నారు. దీంతో విద్యుత్ సరఫరా లేక ఆ లైన్ పరిధిలో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. మరమ్మతులు చేపట్టి, పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన పాడి ఆవు (ఫైల్)

పంటలు ఎండిపోతున్నాయి



విద్యుత్ ప్రమాదంలో పాడి ఆవు మృతిచెందింది. రూ.లక్షదాకా నష్టం వాటిల్లింది. అధికారుల నిర్లక్ష్యంతో కిందపడిన వైర్లను తాకడం వల్లే పాడి ఆవు చనిపోయింది. నాకున్న ఐదెకరాల్లో బోరు కింద పంటలు సాగుచేస్తున్నా. ఒకటిన్నర ఎకరాలో పశుగ్రాసం సాగు చేశా. ప్రమాదం వల్ల ఈప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పశుగ్రాసం ఎండిపోతోంది. ఇతర పంటలు సాగు చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా నూతన లైన్ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారే తప్ప.. ఆ దిశగా చర్యలు చేపట్టిన పాపాన పోలేదు. ఇప్పటికైనా నూతన లైన్ ఏర్పాటు చేయాలి.
- అనిల్‌కుమార్ నాయుడు, నంబులపూలకుంట



సరఫరాలేని విద్యుత్ వైర్లు

త్వరలో పనులు పూర్తి చేస్తాం

విద్యుత్ ప్రమాదాలు జరిగిన ప్రాంతంలో త్వరలో శాశ్వత మరమ్మతులు చేపడతాం. సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.
- సాలేహాబాషా, ఏఈఈ, నంబులపూలకుంట

సూపర్ హిట్ సభకు స్వచ్ఛందంగా లక్షల జనం

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా
● జగన్ అసమర్థత వల్లే ఆర్డీటీకి కష్టాలు
● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభకు లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఆయన జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ సభకు రెండు లక్షల మంది వస్తారని అంచనా వేయగా మూడు లక్షలమంది కంటే ఎక్కువగా తరలివచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. విజయోత్సవ సభ

(మిగతా 6లో...)

లారీ బీభత్సం..!

● మహిళా కార్మికుల ఆటోను ఢీకొని.. ముందుకు..
● దారిలో బైక్‌ను ఈడ్చుకెళ్లిన వైనం
● బైక్‌లలో వెంబడించి పట్టుకున్న స్థానికులు
● డ్రైవర్‌కు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

(వివరాలు 6వ పేజీలో...)

డీపీఓలో పోలీసు కంట్రోల్ రూం

● సత్యసాయి శత జయంత్యుత్సవాల నేపథ్యంలో ప్రారంభం
● సీసీ కెమెరాలతో నిఘా కట్టుదిట్టం: ఎస్పీ





పోలీసు కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభించి.. పనితీరును వివరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో పోలీసు కమాండ్ కంట్రోల్ రూంను ఎస్పీ రత్న గురువారం ప్రారంభించారు. సీసీ కెమెరాలు, బోర్డు రూం, వీడియో కాన్ఫరెన్స్ హాల్‌కు సైతం శ్రీకారం చుట్టారు. ఎస్పీ మాట్లాడుతూ.. సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల నేపథ్యంలో జిల్లాలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భద్రతా ఏర్పాట్లను చేపట్టామన్నారు. అందులో భాగంగా పోలీసుకంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 2,700 అధునాతన సీసీ కెమెరాలు అమర్చామన్నారు. కదిరి, హిందూపురం, మడకశిరలో సబ్ కంట్రోల్ రూం ప్రారంభించామన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో 345 మ్యాట్రిక్స్ సీసీ కెమెరాలు అమర్చామన్నారు. త్వరలోనే పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తిలో సబ్‌కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా జిల్లాలో నేరస్తుల కదలికలపై డ్రోన్, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా పెడతామన్నారు. కమాండ్ కంట్రోల్ రూం ద్వారా డయల్ 100, 112 అత్యవసర కాల్స్‌ను 24 గంటలూ పర్యవేక్షిస్తామన్నారు. మహిళల హెల్ప్‌లైన్ మానిటరింగ్‌పై ప్రత్యేక దృష్టి పెడతామని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నిజమైన బహుమతి





నృత్యం చేస్తున్న బాలవికాస్ చిన్నారులు

పుట్టపర్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రేమతత్వంపై నిజమైన బహుమతి పేరిట బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన నృత్యం భక్తులను అలరింపజేసింది. పార్వతీపురం భక్తులు రెండోరోజు గురువారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగించారు. బాలవికాస్ చిన్నారులు గంటపాటు మధురగానం, నృత్యంతో భక్తులను మంత్ర ముగ్ధులను చేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

జవాబు పత్రాలు మాయం..?

● ఎస్కేయూలో కలకలం..!
● బయటకు పొక్కకుండా సద్దుమణిచే ప్రయత్నాలు
● రహస్య విచారణ చేయిస్తున్నారన్న చర్చ



అనంతపురం రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ)లో కలకలం. జవాబు పత్రాలు మాయమయ్యాయన్న చర్చ జోరుగా సాగుతోంది. వర్సిటీలోని ఓ కళాశాలలోని ఓ కోర్సు సబ్జెక్టుకు సంబంధించిన జవాబు పత్రాలు మాయమైనట్లు తెలుస్తోంది. రెండు నెలలు గడిచినా అవి ఎక్కడున్నాయి? ఏమయ్యాయి? అన్నది తెలియకపోవడం శోచనీయం. విషయాన్ని బయటకు పొక్కకుండా సద్దుమణిచేందుకు సంబంధిత అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయావర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ క్రమంలోనే వర్సిటీ ఉన్నతాధికారులు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, విచారణ చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

మాయమైన జవాబు పత్రాలు

ఈ ఏడాది మే నెలలో వివిధ సెమిస్టర్ పరీక్షలు వర్సిటీ పరీక్షల విభాగం నిర్వహించింది. వర్సిటీలోని ఓ కళాశాలలో పరీక్షలు జరిగాయి. అక్కడి నుంచి జవాబు పత్రాలు పరీక్షల విభాగానికి చేరాయి. అన్ని పరీక్షల అనంతరం జవాబు పత్రాల కోడింగ్.. డీ కోడింగ్ పూర్తి చేసినట్లు సమాచారం. జూలై మొదటి వారంలో జవాబు పత్రాల మూల్యాంకనం కోసం వివిధ కళాశాలలకు తరలించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ కళాశాలకు పంపిన జవాబు పత్రాల్లో ఒక కోర్సు నాలుగో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టుకు సంబంధించినవి మాయమైనట్లు సంబంధిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇందులో 60 మంది విద్యార్థులకుపైగా జవాబు పత్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. సంబంధిత విభాగ ఉద్యోగులు..

(మిగతా 6లో..)

మెడికల్ కాలేజీ కట్టి తీరుతాం: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జగన్ బెదిరింపులకు రాష్ట్రంలో భయపడేవారు ఎవరూ లేరని, పీపీపీ విధానంలో పది వైద్య కళాశాలల నిర్మాణం పూర్తి చేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. షీప్ ఫాం వద్ద అర్ధాంతరంగా ఆగిన మెడికల్ కాలేజీ భవనాన్ని గురువారం ఆమె స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. సీఎం చంద్రబాబు వైద్య కళాశాలలను పీపీపీ ద్వారా పూర్తిచేస్తామని ప్రకటించారని, దీన్ని జీర్ణించుకోలేక జగన్ టెండర్లకు వెళ్లవద్దని భయపెడుతున్నారని మండిపడ్డారు.

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా జగన్ మారారని మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ సభ విజయవంతంపై కృతజ్ఞత సభ గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రం లోటుబడ్జెట్‌లో ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఇది జీర్ణించుకోలేని జగన్ సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జగన్ అసెంబ్లీకి రావాలని, అతడికి ఎంత సమయం కావాలంటే అంతసేపు మైక్ ఇస్తామని, వచ్చే దమ్ముందా అని సవిత సవాల్ విసిరారు. వైసీపీ పాలనలో అవినీతికి పాల్పడిన వారందరికి చట్టపరంగా త్వరలో తగిన బుద్ధి చెబుతామని మంత్రి అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కన్వీనర్ శ్రీరాములు, గుట్టూరు సూరీ, బీజేపీ రామకృష్ణ, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, ఎగువగడ్డ కృష్ణమూర్తి, మావటూరు గోపాల్, రఘువీరచౌదరి, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.



తుప్పు పట్టిన కడ్డీలు చూపుతున్న మంత్రి సవిత

చెరువులన్నీ నింపండి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా నీటితో జిల్లాలోని చెరువులన్నింటినీ నింపాలని నీటి పారుదల శాఖాధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 1,186 చెరువులు ఉన్నాయని, వాటిలో 15 పూర్తిగా నిండాయని అన్నారు. 17 చెరువుల్లో 70శాతం, 55 చెరువుల్లో సగం మేర నీరు ఉందన్నారు. 815 చెరువుల్లో నీరు లేదన్నారు. వాటన్నింటినీ హంద్రీనీవా కాలువ నీటితో నింపాలన్నారు. అనంతరం గృహ నిర్మాణ శాఖాధికారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం ద్వారా 72,338 ఇళ్లు మంజూరు చేయగా.. 28,240 పూర్తయ్యాయన్నారు. 40,009 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయనీ, వాటిని వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఆయా కార్యక్రమాల్లో జేసీ అభిషేక్ కుమార్, నీటి పారుదల ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, భూగర్భ జల డీడీ రాజశేఖర్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఈఈ లక్ష్మీనారాయణమ్మ, డీఈలు శివశంకర్‌నాయక్, శ్రీనివాస్, శంకర్‌లాల్, పశుసంవర్ధక శాఖ జేడీ సుబదాస్, ఏడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

వైసీపీ కోతలు.. కూటమిపైనే ఆశలు..

- కలగానే పీఆర్సీ ఏర్పాటు
- అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పెంపుపై అదే నిర్లిప్తత
- గత ప్రభుత్వంలో కోతలతో తీవ్ర నష్టం



పరిష్కారంకాని పెన్షనర్ల సమస్యలు.. అందని డీఆర్ అరియర్స్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల పాటు ప్రభుత్వ ఉద్యోగాలు చేసి రిటైరైన పెన్షనర్లను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం వారిపై నిర్ధాక్షిణ్యంగా వ్యవహరించింది. అప్పటి వరకు అందుతున్న ప్రయోజనాల్లో కోతలు పెట్టింది. ఆర్థిక ప్రయోజనాలను పూర్తిగా ఆపేసింది. దీంతో ఐదేళ్లు పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారు. డీఆర్ అరియర్స్ పెండింగ్‌లో ఉంచడంతోపాటు... పీఆర్సీ కమిషన్ ఏర్పాటు ఊసే ఎత్తకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అందించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పర్సెంటేజీలను వైసీపీ పాలకులు తగ్గించి మరింత ఆర్థికంగా కుంగదీశారు. ఈహెచ్ఎస్ పరిధిలోని మెడికల్



పెన్షనర్లు

హామీలు అమలు చేయాలి



అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించడంతోపాటు ఈహెచ్ఎస్, డెత్ రిలీఫ్‌లు, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ ఆ సమస్యలు అలాగే ఉన్నాయి. హామీలను నెరవేర్చి, పెన్షనర్లకు ఆదుకోవాలి.

- పెద్దనగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రా పెన్షనర్ల పార్టీ

రీయింబర్స్‌మెంట్‌ను అందించకుండా ఇబ్బందులపాలు చేశారు. పెన్షనర్లు చనిపోతే తక్షణ దహన సంస్కారాల కింద అందించే రూ.25 వేలను పలువురు పెన్షనర్ల కుటుంబాలు కోల్పోవాల్సి వచ్చింది. ఇన్ని సమస్యల నడుమ నెట్టుకొచ్చిన పెన్షనర్లు కూటమి ప్రభుత్వంలోనూ వాటిని ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి, ఆదుకోవాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పెన్షనర్లు దాదాపు 25వేల మంది ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పెన్షనర్లకు 2018 జూలై 1 నుంచి డీఆర్ అరియర్స్‌ను పెండింగ్‌లో ఉంచింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు పెన్షనర్లు చెబుతున్నారు. డీఏ అరియర్స్ విడుదల చేయడంతోపాటు, 1-7-2023 పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇంతవరకూ అమలు చేయకపోవడంతో గతేడాదివి రెండు, 2025లో ఒకటి కలిపి మరో మూడు డీఆర్ అరియర్స్ పెండింగ్ లిస్టులోకి చేరిపోయాయని ఆవేదన చెందుతున్నారు. ఈ లెక్కన దాదాపు ఒక్కో పెన్షనర్‌కు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్ష వరకూ డీఆర్ అరియర్స్ రూపంలో అందాల్సి ఉందని చెబుతున్నారు. అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ విషయంలోనూ 70 ఏళ్ల వయసున్న పెన్షనర్లకు 10 నుంచి 7 శాతానికి, 75 ఏళ్ల వయసు వారికి 15 శాతం నుంచి 12 శాతానికి వైసీపీ ప్రభుత్వం కుదించి ఆర్థికంగా దెబ్బతీసింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో వాటిని పూర్వస్థితికి తీసుకొస్తామని హామీ ఇచ్చినా.. ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో పెన్షనర్లకు ఎదురుచూపులు తప్పడంలేదు. ఈహెచ్ఎస్ పరిధిలో ప్రస్తుతం కేవలం కంటి, మోకాళ్లు, పంటి తదితర చిన్న చిన్న వాటికే వైద్యం చేయడం... సర్జరీలు జరిగిన వారికి అందించాల్సిన మెడికల్ రీయింబర్స్‌మెంట్లు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నెలనెలా పెన్షన్ శాతాన్ని బట్టి రూ.225 నుంచి రూ.300 ఈహెచ్ఎస్ కింద జమవుతున్నా... బిల్లులు రాకపోవడంతో డబ్బులు వెచ్చించి సర్జరీలు చేయించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పెన్షనర్ చనిపోతే దహన సంస్కారాలకు అందించే డెత్ రిలీఫ్ మొత్తం రూ.25 వేలు కూడా ఇవ్వట్లేదు. వీటిన్నింటినీ పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారనీ, వాటిని వీలైనంత త్వరగా అమలు చేసి, ఆదుకోవాలని కోరుతున్నారు.

డెత్ రిలీఫ్‌లను విడుదల చేయాలి



చనిపోయిన పెన్షనర్లకు తక్షణసాయం కింద అందించే డెత్ రిలీఫ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం వాటిని రూ.10 వేలకు పరిమితం చేసింది. మునుపటిలా ఆ మొత్తాన్ని రూ.25 వేలకు పెంచి, పెన్షనర్లను ఆదుకోవాలి. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఆర్ అరియర్స్‌ను విడుదల చేయడంతో పాటు... పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసిన 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న మరో మూడు డీఆర్ అరియర్స్‌ను విడుదల చేయాలి.

- రామకృష్ణ, జిల్లా కోశాధికారి, ఏపీ పెన్షనర్ల సంఘం

మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను పెంచాలి



టీడీపీ హయాంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద రూ.2 లక్షల వరకూ వర్తించేది. వైసీపీ హయాంలో దానిని పెంచకపోగా... రూ.2 లక్షలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టింది. ఈహెచ్ఎస్ ఊసేలేకుండా చేసింది. పెన్షనర్లు చేతినుంచి డబ్బులు పెట్టుకోవాల్సి వచ్చింది. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం ఈహెచ్ఎస్ కింద కంటి, పంటి, మోకాళ్లు తదితర వాటికి మాత్రమే అమలు చేస్తున్నారు. సర్జరీలు చేయించుకున్న పెన్షనర్లు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారు. వాటిని విడుదల చేయడంతో పాటు... రీయింబర్స్‌మెంట్‌ను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలి.

-ప్రభాకర్, జిల్లా నిర్వాహక కార్యదర్శి, ఏపీ పెన్షనర్ల సంఘం

కోయంబత్తూరు నుంచి కాల్..!

- డీఎస్సీ సెలెక్ట్ అభ్యర్థి వీడియో కాల్
- సర్టిఫికెట్ల పరిశీలనకు వస్తున్నానంటూ సమాచారం
- కొత్తగా ముగ్గురు డీఎస్సీ అభ్యర్థులకు కాల్ లెటర్లు
- ఇద్దరి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



కోయంబత్తూరు నుంచి వీడియో కాల్‌లో ఐటీ సెల్ ఏపీఓతో మాట్లాడుతున్న డీఎస్సీ సెలెక్ట్ అభ్యర్థి రమ్యశిల్ప

అనంతపురం విద్య, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో అనర్హుల ఏరివేత కొనసాగుతోంది. అదే సమయంలో అర్హులు ఎక్కడున్నా అవకాశం కల్పిస్తున్నారు. డీఎస్సీ రాసిన అభ్యర్థులు తుది జాబితాలో చోటు దక్కకపోవడంతో ఆశలు వదులుకున్నారు. తమ పనుల్లో నిమగ్నమయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన పకడ్బందీగా చేపట్టడంతో బోగస్‌లు బయటపడ్డారు. వారిని రిజెక్ట్ చేయడంతో కొత్త వారిని అవకాశం వెతుక్కుంటూ వెళ్తోంది. తాజాగా మరో ముగ్గురు డీఎస్సీ అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖాధికారులు కాల్ లెటర్లు పంపారు. సాయంత్రంలోగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని అందులో ఆదేశించారు. కోయంబత్తూరులో ఉన్న ఓ అభ్యర్థి.. విద్యాశాఖ అధికారులకు వీడియో కాల్ చేశారు. తాను కోయంబత్తూరులో ఉన్నానంటూ సమాచారం ఇచ్చారు.

మళ్లీ.. మళ్లీ.. పరిశీలన

నిబంధనల మేరకు అర్హత ఉంటే ఎక్కడ ఉన్నా ఉద్యోగం వస్తుందనడానికి డీఎస్సీ-2025 నియమకాల పక్రియే నిదర్శనం. జిల్లాలో 807 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. వేలాదిమంది అభ్యర్థులు పోటీపడ్డారు. ఈసారి బోగస్‌లను ఏరివేసి నిజమైన అర్హులకే ఉద్యోగాలు కట్టబెట్టాలని సర్కారు పటిష్ట చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే డీఎస్సీ నియామకాల పక్రియను రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 773 మంది అభ్యర్థులకు ఎంపిక కాల్ లెటర్లు వచ్చాయి. వారందరి ఒరిజనల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో ప్రత్యేక కమిటీలు పరిశీలించాయి. ఇప్పటికి ఐదుసార్లు పరిశీలన చేయించారు. అనుమానం, ఆరోపణలు వచ్చిన అభ్యర్థుల సర్టిఫికెట్లపై సంబంధిత శాఖలకు పంపి, అక్కడి నుంచి ఆమోదం లభిస్తేనే ఆమోదం తెలుపుతున్నారు. లేదంటే రిజెక్ట్ చేస్తున్నారు. ఇలాంటివి జిల్లాలో 14 తిరస్కరించారు. మరో నాలుగైదింటిపై సంబంధిత శాఖల నివేదికల కోసం వేచి చూస్తున్నారు.

తాజాగా మరో ముగ్గురికి కాల్‌లెటర్లు

డీఎస్సీ నియామకాల పక్రియ ముగింపు దశకు చేరుకోవడంతో పూర్తిస్థాయిలో సెలెక్షన్ లిస్టు తయారు చేసి ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే డ్యూయల్ పోస్టులు, అసత్య సమాచారంతో రిజక్ట్ అయిన అభ్యర్థుల స్థానంలో ఆ తరువాతి స్థానాల్లో ఉన్న వారికి రాష్ట్రశాఖ కాల్‌లెటర్లు పంపిస్తోంది. అందులో భాగంగా గురువారం మరో ముగ్గురు డీఎస్సీ అభ్యర్థులకు కాల్‌లెటర్లు వచ్చాయి. ఆ జాబితాలో ఉన్న అభ్యర్థులను పిలిపించుకుని సాయంత్రంలోగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి, నివేదికలు పంపాలని రాష్ట్ర శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇద్దరు అభ్యర్థులు జిల్లాలోనే ఉన్నారు. వారు సాయంత్రానికి సర్టిఫికెట్లు తీసుకొచ్చి పరిశీలన చేయించుకున్నారు. రాయదుర్గానికి చెందిన అభ్యర్థి రమ్యశిల్ప కోయంబత్తూరులో ఉన్నట్లు విద్యాశాఖ అధికారులకు తెలిపారు. వీడియోకాల్ చేసి కోయంబత్తూరులో ఉన్నాననీ, బయల్దేరానంటూ విద్యాశాఖ ఐటీసెల్ సిబ్బందికి వివరణ చేసుకున్నారు. అదేవీడియో కాల్ మాటలను రికార్డు చేసుకుని, డీఈఓ ప్రసాద్‌బాబుకు ఆమె పంపించారు. దీనిని బట్టి అర్హత ఉంటే ఎక్కడున్నా ఉద్యోగం వస్తుందని స్పష్టమైంది.

సభ సక్సెస్‌కు పూలల బాట

- సూపర్ 'హిట్' కోసం ఆర్టీసీ జోనల్ చైర్మన్ ప్రత్యేక చొరవ



బస్సుల ఏర్పాటుపై మంత్రులు, కలెక్టర్, అధికారులతో చర్చిస్తున్న పూల నాగరాజు(ఫైల్)

అనంతపురం టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ -సూపర్ హిట్ విజయోత్సవ సభకు బస్సుల సమీకరణలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ప్రత్యేక చొరవ చూపారు. వారం రోజులుగా జిల్లా కేంద్రంలోనే ఉండి సభ విజయవంతానికి కృషి చేశారు. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితోపాటు ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులతో పూల నాగరాజు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి బస్సుల సమీకరణపై చర్చలు జరిపారు. సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది కలగని విధంగా ఆర్టీసీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సమీకరించాల్సిన బస్సులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి మంత్రి ద్వారా ఆమోదం పొందారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 3050 ఆర్టీసీ బస్సులు, 600 ప్రైవేట్ బస్సులను ముఖ్యమంత్రి సభకు ఏర్పాటు చేయించి సభ విజయవంతంలో తన వంతు పాత్ర పోషించారు.

అనుకున్న లక్ష్యాన్ని సాధించాం

- పూల నాగరాజు, ఆర్టీసీ జోనల్ చైర్మన్

సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభకు 2 లక్షల మందిని తరలించాలనే లక్ష్యంతో బస్సుల ఏర్పాట్లకు మంత్రులు, జిల్లా అధికారుల సహకారంతో చర్యలు చేపట్టాం. అయితే మేము అనుకున్న లక్ష్యం మేరకు ప్రజలు తరలి వచ్చారు. కొన్ని రూట్లలో బస్సులు నిండిపోయి టాపు పైన కూడా ఎక్కి అభిమానులు తరలివచ్చారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి కూటమి ప్రభుత్వంపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

డీఎఫ్ఓ విఘ్నేష్ బదిలీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) విఘ్నేష్ అప్పావు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఎఫ్ఎస్ అధికారులను ప్రభుత్వం గురువారం బదిలీ చేసింది. ఈ క్రమంలో డీఎఫ్ఓ విఘ్నేష్‌ను ఆత్మకూరులోని నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్)కు డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఎఫ్ఓగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

జవాబు పత్రాలు మాయం..?

(5వ పేజీ తరువాయి)

విషయం వర్సిటీ ఉన్నతాధికారులకు తెలియకుండా గుట్టుగా ఉంచినట్లు సమాచారం. ఈక్రమంలోనే సదరు విభాగంతోపాటు ఇతరత్రా చోట్ల జవాబు పత్రాల కోసం వెతికినట్లు తెలుస్తోంది. దొరక్కపోవడంతో సదరు ఉద్యోగులు మిన్నకుండిపోయినట్లు సమాచారం. కొన్నిరోజుల కిందట మార్కుల కంప్యూటరీకరణ నేపథ్యంలో విషయం బయటికొచ్చినట్లు ఆయావర్గాల్లో చర్చ సాగుతోంది. సంబంధిత సబ్జెక్టు మార్కుల వివరాలు లేకపోవడంతో విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమచారం. ఈక్రమంలోనే వ్యవహారం వర్సిటీ ఉన్నతాధికారులు చేరడంతో విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఆ మేరకు ప్రత్యేక కమిటీని నియమించినట్లు ఆయావర్గాల్లో చర్చ జరుగుతోంది.

బయటకు పొక్కకుండా..

జవాబు పత్రాల మాయం విషయం బయటకు పొక్కకుండా వర్సిటీ అధికారులు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. విషయం బయటకు తెలిస్తే వర్సిటీ ప్రతిష్ఠ దిగజారడంతోపాటు విమర్శలు, ఆందోళనలు తలెత్తుతాయని గుట్టుగా సద్దుమణిచే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు వర్సిటీలో చర్చ సాగుతోంది. అధికారులు అలాంటిదేమీ లేదని కొట్టి పారేసుండడం గమనార్హం. రహస్య విచారణ చేస్తున్నారన్న వాదనలు ఆయావర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

ఇటీవలే బాధ్యతలు తీసుకున్నా

పరీక్షల విభాగ కంట్రోలర్‌గా ఇటీవలే బాధ్యతలు తీసుకున్నా. జవాబు పత్రాలు కనిపించడం లేదన్న విషయం నా దృష్టికి రాలేదు. అలాంటిది ఏమైనా ఉంటే విచారణ చేయిస్తాం.

-శ్రీరాములు నాయక్, పరీక్షల విభాగ కంట్రోలర్, ఎస్కేయూ

మా దృష్టికి రాలేదు..

వర్సిటీలో జవాబు పత్రాలు కనిపించడం లేదన్న విషయం మా దృష్టికి రాలేదు. విచారణ నిమిత్తం ప్రత్యేక కమిటీని కూడా నియమించ లేదు. కమిటీని నియమిస్తే కచ్చితంగా చెబుతాం. అందులో రహస్యం ఏముంటుంది?

-రాజశేఖర్ బాబు, రిజిస్ట్రార్, ఎస్కేయూ

లారీ బీభత్సం..!

- మహిళా కార్మికుల ఆటోను ఢీకొని ఆపకుండా ముందుకు..
- దారిలో ద్విచక్రవాహనాన్ని ఈడ్చుకెళ్లిన వైనం
- కిలోమీటర్ల మేర బైక్‌లపై వెంబడించిన స్థానికులు
- లారీలు అడ్డుగా పెట్టి పట్టుకుని.. డ్రైవర్‌కు దేహశుద్ధి



లారీని ద్విచక్రవానాల్లో వెంబడిస్తున్న యువకులు





గాయపడిన అన్నపూర్ణ, ఉమాదేవి

హిందూపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో గురువారం సాయంత్రం లారీ బీభత్సం సృష్టించింది. మహిళా కార్మికుల ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. డ్రైవర్ ఆపకుండా అలానే ముందుకెళ్లాడు. స్థానికులు బైక్‌లలో వెంబడించారు. దారిలో మరో బైక్‌ను లారీ కిలోమీటరు మేర ఈడ్చుకెళ్లింది. దాదాపు 10 కిలోమీటర్ల మేర స్థానికులు బైక్‌లలో వెంబడించారు. ఆ ఛేజింగ్ సీన్ సినిమా స్టంట్‌ను తలపించింది. ఆఖరుకు రోడ్డుకు అడ్డుగా లారీలను ఉంచి, పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నారు. హిందూపురం పట్టణ పరిధి కొల్లకుంట సమీపంలో సాయంత్రం గార్మెంట్స్ కార్మికులతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో అన్నపూర్ణ, ఉమాదేవికి గాయాలయ్యాయి. లారీ ఆపకుండా పెనుకొండ వైపు వెళ్తుండగా అక్కడున్న కొంతమంది యువకులు సుమారు 10కి.మి. మేర ద్విచక్రవాహనాల్లో వెంబడించారు. దారిలో పక్కనే ఆపిన బైక్‌ను సైతం లారీ కిలోమీటరు మేర ఈడ్చుకెళ్లింది. ఆఖరుకు చాలకూరు-బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య లారీని పట్టుకుని, డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న సోమందేపల్లి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, లారీని సోమందేపల్లి స్టేషన్‌కు తరలించారు. గాయపడినవారిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సూపర్ సభకు స్వచ్ఛందంగా లక్షల జనం

(5వ పేజీ తరువాయి)

సక్సెస్ కావడం సంతోషంగా ఉందన్నారు. అయితే వైసీపీ నాయకులు మాత్రం మభ్యపెట్టి జనాలను తరలించారంటూ ఫేక్ ప్రచారాలకు దిగడం శోచనీయమన్నారు. విప్ కాలవ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ తొలిసభ అనంతపురంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతపురం అభివృద్ధి, సీమ భవిష్యత్తు టీడీపీతోనే ముడిపడి ఉందన్నారు. సూపర్ హిట్ సభ నభూతో నభవిష్యత్తు అన్న రీతిలో జరిగిందన్నారు. రాయలసీమ గడ్డ టీడీపీ అడ్డాగా మారిందనడానికి మొన్న కడపలో జరిగిన మహానాడు, నిన్నటి అనంతలో జరిగిన సభ నిదర్శనం అన్నారు. ఈ ఆదరణను చూసే కుట్రతో జగన్ ఏది పడితే అది మాట్లాడుతున్నాడంటూ మండిపడ్డారు. జగన్ అసమర్థత, ఎంపీల స్వార్థం వల్లే 2021 నుంచి ఆర్డీటీకి కష్టాలు మొదలయ్యాయన్నారు. ఆర్డీటీ సేవలపై కేంద్రానికి వివరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ మంజూరు చేయించే బాధ్యతను ఇద్దరు ఎంపీలకు సీఎం అప్పగించినట్లు తెలిపారు. ఈ అంశంపై జగన్‌కు, వైసీపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ఎందుకు ప్రయత్నాలు చేయలేదంటూ ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్ర బాబు, బండారు శ్రావణీశ్రీ, పల్లె సింధూరారెడ్డి, అనంతపురం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ప్రధానకార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు అంజినప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఇతర టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు తదితరులు పాల్గొన్నారు.

14న కబడ్డీ ఎంపిక పోటీలు

కదిరిఅర్బన్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో 14వ తేదీన కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు వెంకటరమణ గురువారం ప్రకటనలో తెలిపారు. 20 సంవత్సరాలలోపు, బాలబాలికలు అర్హులన్నారు. బాలురు 75 కిలోలలోపు, బాలికలు 65కిలోలలోపు బరువు ఉండాలన్నారు. ఎంపికైన వారు విజయవాడలో ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

సింగపూర్‌కు ధర్మవరం విద్యార్థినులు

- ఫ్లోర్‌బాల్ పోటీలకు 12 మంది ఎంపిక

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఫ్లోర్‌బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ చూపినట్లు హెచ్ఎం జ్యోతిలక్ష్మి, పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం, పీడీ మాట్లాడుతూ గత నెలలో నరసరావుపేటలో జరిగిన 19వ నేషనల్ ఫ్లోర్‌బాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్-14 విభాగంలో 14 మంది జాతీయ స్థాయిలో పాల్గొనగా 12మంది అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. 8వతరగతికి చెందిన గీతిక, హేమశ్రీ, అప్నా అంజన్, రోహిణి, సాయిగీతిక, జాహ్నవి, 9వతరగతికి చెందిన తేజశ్రీ, నందిని, ఉషశ్రీ, శ్రీదేవి, ఈశ్వరి, గౌతమి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. వీరు ఈనెల నాలుగో వారం లేదా అక్టోబరు మొదటి వారంలో సింగపూర్‌లో నిర్వహించే ఫ్లోర్‌బాల్ అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వీరిని బీఎస్ఆర్ బాలుర ఉన్నతపాఠశాల హెచ్ఎం మేరి వరకుమారి, పాఠశాల కమిటీ చైర్మన్ బాబావలి, ఉపాధ్యాయులు అభినందించారు.



అంతర్జాతీయ ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పాఠశాల హెచ్ఎం, పీడీలు

ఒకే ఒక్కడు !

మూడేళ్లలో మూడువేలకుపైగా కంటి శస్త్ర చికిత్సలు

- రాష్ట్రంలోనే జిల్లాను టాప్‌లో నిలిపిన డాక్టర్ సైదన్న
- అరకొర సౌకర్యాలతోనే అన్నీ తానై నిర్వహిస్తున్న వైద్యుడు



డాక్టర్ సైదన్నతో కంటి శస్త్రచికిత్స చేయించుకున్న వారు (ఫైల్)



నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సైదన్న

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఒకే ఒక్కడు. మూడేళ్లలో మూడువేలకు పైగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి రికార్డు సృష్టించాడు. జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో నేత్రవైద్య నిపుణుడిగా పనిచేస్తున్న డాక్టర్ సైదన్న ఎన్‌పీసీబీవీఐ (నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపైర్‌మెంట్) ద్వారా మూడేళ్లలో 3,160 ఉచిత కంటి ఆపరేషన్లు చేసి రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలిపారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5వరకు 15 రోజుల పాటు నిర్వహించిన జాతీయ నేత్ర దాన అవగాహన సదస్సులో భాగంగా డాక్టర్ సైదన్న విద్యాసంస్థలు, జన సమూహ ప్రాంతాలకెళ్లి నేత్ర దానం, అంధత్వ నివారణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అన్నీ తానై..

జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డీఎంహెచ్ఓ కార్యదర్శిగా ఎన్‌పీసీబీవీఐ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో ఎన్‌పీసీబీవీఐ నిర్వహణ కోసం ప్రభుత్వ సర్వజన వైద్యశాల అనుబంధ క్యాన్సర్ యూనిట్‌లో ప్రత్యేక ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఇందులో వారంలో రెండు రోజులపాటు ఆపరేషన్లు చేస్తూ పేదలకు చూపును ప్రసాదిస్తున్నారు. శస్త్ర చికిత్సలు చేయడానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందడంలేదని తెలుస్తోంది. ఓపీ, ఐపీ, ఓటీ మూడు విభాగాలకు సరిపడా సిబ్బందిని నియమించడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఓటీ అసిస్టెంట్, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, స్టాఫ్ నర్స్, అటెండర్లు ఇలా అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్నీ తానై డాక్టర్ సైదన్న ఆపరేషన్లు చేసి ఎంతో మంది పేదలకు చూపును ప్రసాదిస్తున్నారు. ఎన్‌పీసీబీవీఐ నిర్వహణపై ఉన్నతాధికారులు అలసత్వాన్ని వీడి చేయూతని ఇవ్వాల్సిన అవసరం ఉంది.



సృష్టిలో ఏకైక సేవామార్గం



నేత్ర దానం కంటే సృష్టిలో గొప్పసేవా మార్గం మరొకటి లేదు. మరణాంతరం నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చు. డాక్టర్‌గా నాకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్‌పీసీబీవీఐ ద్వారా నేత్ర శస్త్రచికిత్సలు చేస్తున్నా. మూడేళ్లలో 3,160 కంటి ఆపరేషన్లు చేశా. ఆపరేషన్ చేయించుకున్న ప్రతిఒక్కరూ తిరిగి చూపును పొందుతున్నారు. దీంతో జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల వారు తరలివస్తున్నారు.

- డాక్టర్ సైదన్న, ఎన్‌పీసీబీవీఐ, ఆప్తాల్మిక్ సివిల్ సర్జన్

పట్టు రైతులు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

నా పట్టు - నా అభిమానంలో పాల్గొన్న ఎంపీలు అంబికా, బీకే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా పట్టు రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు అన్నారు. పట్టణంలోని యాదవ కల్యాణ మంటపంలో నా పట్టు-నా అభిమానం అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలతో పాటు సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ సురేష్‌బాబు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్ అరుణకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు నెలలో మడకశిరలో పర్యటించి నపుడు పట్టు రైతులు, రీలర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈనెల 18 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కూడా పట్టు రైతుల సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ మల్బరీ రైతులకు గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం అధికంగా తోడ్పాటు ఇస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు రైతులకు మెలకువలు నేర్పుతు లాభాలు గడించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ పట్టు రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు అందేలా పని చేస్తామన్నారు. పట్టు గూళ్లకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ మల్బరీ రైతుల షెడ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. రైతులు.. శాస్త్రవేత్తల ద్వారా మెలకువలు నేర్చుకుని అధిక దిగుబడి సాధించాలని అభిలషించారు. అనంతరం ఉత్తమ రైతులకు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, ఏడీ హనుమంతరాయ, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక రైలు

గుంతకల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా రద్దీని నియంత్రించడానికి బెంగళూరు-బీదర్ మధ్య (వయా గుంతకల్లు) ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ ప్రత్యేక రైలు (06291) ఈనెల 30వతేదీ రాత్రి 9-15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు 11-30 గంటలకు బీదర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06292) బీదర్‌లో అక్టోబరు 1వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4 గంటలకు బెంగళూరుకు చేరుతుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, వాడి, షాహాబాద్, కలబురగి, హుమ్నాబాద్ స్టేషన్ల మీదుగా బీదర్ చేరుతుందన్నారు.

ఏడు దరఖాస్తుల తిరస్కరణ

వయోజన విద్య సూపర్ వైజర్ పోస్టులకు 21 అప్లికేషన్లు

పరిశీలనలో 14 ఆమోదం... నేటి ఇంటర్వ్యూలు వాయిదా

అనంతపురం విద్య, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): వయోజన విద్య శాఖలో ఖాళీగా ఉన్న కదిరి, పెనుకొండ డివిజన్‌కు చెందిన రెండు సూపర్‌వైజర్ పోస్టులకు టీచర్లు పోటీ పడ్డారు. ఎస్జీ కేడర్ టీచర్లు 21మంది దరఖాస్తు చేసుకున్నారు. కనీసం పదేళ్ల సర్వీస్ ఉండి 45 ఏళ్ల వయసులోపు ఉన్నవారిని అర్హులుగా నిర్ణయించారు. వచ్చిన దరఖాస్తులను గురువారం వయోజన విద్య డీడీ వెంకటేశ్వర్లు స్వయంగా పరిశీలించారు. పదేళ్ల సర్వీస్ లేనివారు, వయసు దాటిన వారు ఏడుగురిని గుర్తించి, వారి దరఖాస్తులను తిరస్కరించినట్లు డీడీ తెలిపారు. అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని వాయిదా వేశామన్నారు. ఎప్పుడు నిర్వహించేదీ తరువాత తెలియజేస్తామని డీడీ వివరించారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అర్హులైన ముస్లింలు, దూదేకులు, క్రిస్టియన్ మైనారిటీలు ప్రధానమంత్రి విశ్వకర్మయోజనకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారి జగన్‌మోహన్ గురువారం ప్రకటనలో కోరారు. ఈ పథకం ద్వారా సంప్రదాయ వృత్తులు (స్వర్ణకారులు, కార్పెంటర్లు, శిల్పకారులు, కొలిమి, బుట్టలు, చాపలు, పరకలు అల్లికవారు, చెప్పులు కుట్టేవారు, దోబీ, కుమ్మరి, దర్జీ, తాపీ కార్మికులు, బార్బర్, రాళ్లు కొట్టేవారు, పూలదండలు, బొమ్మలు, తాళాలు తదితర పనులు చేసేవారు) అనుసరించేవారికి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ పరికరాల కొనుగోలుకు లక్ష నుంచి మూడు లక్షల వరకు 5శాతం వడ్డీతో బ్యాంకుల ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. 18 ఏళ్లు నిండి, గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ రుణాలు పొందని వారు అర్హులన్నారు. లబ్ధిదారులకు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ ఉండాలన్నారు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.పీఎంవీఐఎస్‌హెచ్‌డబ్ల్యూఏకేఏఆర్‌ఎంఏ, జీఓవీ.ఐఎన్‌లో లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అరటికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం

ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాస్

ధర్మవరంరూరల్/రాప్తాడు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): అరటి పంటకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి, గిట్టుబాటు ధరలు దక్కేలా చూస్తామని ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ధర్మవరం మండలం ఉప్పునేసినపల్లి, రాప్తాడు మండలం మరూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఉప్పునేసినపల్లి వద్ద రైతు నారా అశోక్ 25ఎకరాల్లో సాగుచేసిన అరటి పంటను కమిషనర్ పరిశీలించారు. పంట సాగుపై రైతును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మరూరు వద్ద చీనీ, అరటి రైతులతో చర్చించారు. ఊరూరా రైతులు విరివిగా ఉద్యాన పంటలు సాగు చేయాలన్నారు. ఆయన వెంట అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉద్యాన శాఖాధికారులు ఉమాదేవి, చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీలు రఘునాథ్ రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

బస్సును ఢీకొట్టిన టీచర్ల కారు

ఒకరికి తీవ్రగాయాలు



బస్సును ఢీకొట్టిన కారు

అనంతపురం విద్య, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శింగనమల మండలం లోలూరు గ్రామ సమీపాన జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఆపివున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి టీచర్ల కారు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శింగనమల మండలం తరిమెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు రోజూ అనంతపురం నుంచి వెళ్లివస్తుండేవారు. అందులో భాగంగా గురువారం ఉదయం ఐదుగురు టీచర్లు పాఠశాలకు బయల్దేరారు. లోలూరు వద్ద ఆర్టీసీ బస్సు ఆపి.. ప్యాసింజర్ దిగుతుండగా.. వెనుక నుంచి టీచర్ల కారు ఢీకొంది. దీంతో కారులో డ్రైవర్ పక్కన కూర్చున్న మహిళా టీచర్ ఆర్థర్ జాన్ తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను అనంతపురంలోని సాయినగర్‌లోగల ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. గాయపడిన టీచర్‌ను శింగనమల ఎంఈఓలు శివప్రసాద్, రామ్మూర్తి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి పరామర్శించారు.

దంచికొట్టిన వాన

ఉప్పొంగిన వాగులు.. వంకలు

పరవళ్లు తొక్కిన చిత్రావతి, వేదవతి

వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

నీట మునిగిన పంట చేలు.. రైతులకు నష్టం



చెట్నేపల్లి సమీపంలో పారుతున్న ఉప్పు వంక

"భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. వాగులు, వంకలు ఉప్పొంగాయి. నదులు పరవళ్లు తొక్కాయి. చెక్‌డ్యాంలు, ఫాం పాండ్లకు భారీగా నీరు చేరింది. పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కంది, వరి పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. కణేకల్లు మండలంలో 16 హెక్టార్లల్లో రూ.4.05 లక్షల విలువైన వరి పంట దెబ్బతింది. జిల్లా వ్యాప్తంగా 83.81 హెక్టార్లల్లో రూ.20.95 లక్షల విలువైన వేరుశనగ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ యంత్రాంగం ప్రాథమిక అంచనా వేసింది. గుత్తి, యాడికి మండలాల్లో 3.53 హెక్టార్లల్లో రూ.9 లక్షల విలువైన టమోటా పంట దెబ్బతింది. శింగనమల మండలం గోవిందరావు పేటలో రైతులు రామాంజినేయులు, ఆదినారాయణకు చెందిన 3 ఎకరాల్లో కోత కోసిన వేరుశగన పంట వర్షానికి కొట్టుకుపోయింది. రూ.2 లక్షలకుపైగా పంటనష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు. బొమ్మనహాళ్ మండలంలోని 50 ఎకరాల్లో వరి పొలాల్లోకి వర్షపు నీరు చేరింది."



గరుడచేడు వద్ద నీట మునిగిన వేరుశనగ పంట

కాలనీలు జలమయం

● గుత్తి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, ఎస్‌బీఐ కాలనీ, గుత్తి ఆర్ఎస్‌లోని సుద్ద ఫ్యాక్టరీ ప్రాంతం, బీసీ కాలనీ, జగనన్న కాలనీల జలమయం అయ్యాయి. చెట్నేపల్లి సమీపంలోని ఉప్పు వంక రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే బ్రిడ్జి కింద భారీ ఎత్తున నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

● గుత్తి మండలం బేతాపల్లి, బసినేపల్లి, ఊటకల్లు, ఊబిచేర్ల, చెట్నేపల్లి, ధర్మాపురం కరిడికొండ తదితర గ్రామాలల్లో గరువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మండలంలో 8.62 సెం.మీ. వర్షపాతం నమోదైందని తహసీల్దారు పుణ్యవతి తెలిపారు.

● బొమ్మనహాళ్ వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వేదవతి హగరికి భారీగా వరద నీరు చేరింది. ఉద్దేహాళ్, ఉప్పరహాళ్ క్రాస్, లింగదహాళ్, కొళగానహళ్లి తదితర గ్రామాల వద్ద వరి పంట నీట మునిగింది. కొళగానహళ్లి సమీపంలో కబ్బాలి వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉద్దేహాళ్ హైస్కూల్, సినిమా థియేటర్ ఆవరణలోకి భారీగా నీరు చేరింది. పత్తి, మొక్కజొన్న పంట నీట మునిగాయి. ఈ నీటిని తొలగించుకోవాలని వ్యవసాయాధికారి సాయికుమార్ రైతులకు సూచించారు.

● ఉరవకొండ మండలంలో 9.02 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈశ్వరమ్మ దేవాలయం ప్రాంతం జలమయం అయ్యింది. బూదగవి చెరువులోకి భారీగా వర్షపు నీరు చేరింది. వజ్రకరూరు మండలంలో 7.78 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పొట్టిపాడు- చాయాపురం మధ్య వంక ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

● కనగానపల్లి మండలంలో 2.62 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దాదులూరు, మామిళ్లపల్లి, కనగానపల్లి, తూంచెర్ల ప్రాంతాల్లో కుంటలు, చెక్‌డ్యాంల్లోకి నీరు చేరింది. పొలాల్లో వేరుశనగ కట్టె, విత్తన కాయలు తడిచి నష్టపోయామని రైతులు సూరి, గోవిందు, జనార్దన, నాగరాజు తెలిపారు.

● డి. హీరేహాళ్ మండలంలో 3.7 సెం.మీ. వర్షం కురిసిందని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. వంకలు, వాగులు పొర్లి పొంగాయి. గొడిశలపల్లి, ఏళంజి గ్రామాల మధ్య వాగు ఉధృతంగా ప్రవహించడంతో మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. రాయదుర్గం మండలం టి.వీరాపురం వద్ద గాలివానకు భారీ వృక్షాలు కూలిపోయాయి. రాయదుర్గం-కణేకల్లుకు మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● కణేకల్లు మండలంలో 9.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వేదవతి హగరిలో భారీగా వరదనీరు ప్రవహించడంతో కణేకల్లు, ఉరవకొండ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బెణెకల్లు, సీతానగర్ క్యాంపుల వద్ద వంక పొంగిపొర్లడంతోరాకపోకలు నిలిచిపోయాయి. గరుడచేడులో వేరుశనగ పంటలు నీట మునిగాయి.

నదుల పరవళ్లు

చిలమత్తూరు: మండలంలో కుషావతి, చిత్రావతి నదులు పవరళ్లు తొక్కాయి. కర్ణాటకలోని గుడిబండ, వాటం కొత్తపల్లి ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కుషావతికి నీరు చేరింది. తెల్లవారే వరకూ ప్రశాంతంగా ఉన్న నది.. ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించింది. ఈ ఏడాది నది ప్రవహించడం ఇదే తొలిసారి. నది ఎండిపోవడంతో బోరుబావులు అడుగంటాయి. తాజా నీటితో రీచార్జి అవుతాయని రైతులు భావిస్తున్నారు. మండలంలో మోస్తరు వర్షం కురిసింది. మొక్కజొన్న పంటకు మేలు జరుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యల్లనూరులో కుండపోత

యల్లనూరు మండలంలో బుధవారం రాత్రి 10.6 సెం.మీ. వర్షపాతం నమోదైందని తహసీల్దార్ రాము తెలిపారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5గంటల వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గిరమ్మబావి వంక, మడుగు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. చిత్రావతినదికి నీటి ఉధృతి పెరిగింది. యల్లనూరులో చెట్టు విరిగి పడి రామాంజనేయులుకు చెందిన కారు ధ్వంసమైంది.



చిత్రావతి నదిలో ప్రవహిస్తున్న నీరు

జలపాతం కనువిందు



రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జలపాతం

యాడికి మండలంలో 5.7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నిట్టూరు వద్ద వంక ఉధృతంగా ప్రవహించింది. వేములపాడు వద్ద వంకలో ఒక కారు ఇరుక్కుపోయింది. స్థానికులు ట్రాక్టర్ సాయంతో బయటకు లాగారు. కోనుప్పలపాడు రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జలపాతం కనువిందు చేస్తోంది.



నిట్టూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

చెక్‌డ్యాంలు కళకళ



శింగనమల ఆయకట్టు భూముల్లో నీరు

శింగనమల మండలంలో చెక్‌డ్యాంలు, ఫాం పాండ్లు కళకళలాడుతున్నాయి. ఆకులేడు, లోలూరు మినహా అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గోవిందరాయునిపేటలో వేరుశనగ పంట కొట్టుకుపోవడంతో రైతు రామాంజినేయులు తీవ్రంగా నష్టపోయాడు.



కొట్టుకుపోయిన వేరుశనగ పంట

స్తంభించిన రాకపోకలు

విడపనకల్లు మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఆర్.కొట్టాల-గడేకల్లు, పొలికి-పెంచలపాడు, ఉరవకొండ-ఉండబండ, పాల్తూరు-గోవిందవాడ దారుల్లో వంకలు ఉధృతంగా ప్రవహించాయి. ఆ ప్రాంత గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి. ఈ దారుల్లో గుంతకల్లుకు వెళ్లే ప్రయాణికులు ఉరవకొండ మీదుగా ప్రయాణించారు. గుంతకల్లు నుంచి బళ్లారికి వెళ్లే వారు కర్ణాటకలోని జోళదరాశి గ్రామం మీదుగా ప్రయాణించారు.



ఆర్ కొట్టాల, గడేకల్లు మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

దళిత ద్రోహి జగన్

ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి



మాట్లాడుతున్న ఉండవల్లి శ్రీదేవి

అనంతపురం విద్య, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దళితుల పథకాలకు సంబంధించిన నిధులను పక్కదారి పట్టించిన ద్రోహి వైఎస్ జగన్ అని ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి మండిపడ్డారు. జిల్లాకేంద్రంలోని పెన్నార్ భవన్‌లో గల ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. అక్కడ ఆమె మాట్లాడుతూ.. తన ఎస్సీలు, తన ఎస్టీలు అని చెప్పుకునే దళితులు.. దళితులు అభివృద్ధి చెందితే తట్టుకోలేడన్నారు. అణగదొక్కడానికే చూస్తారని ఆరోపించారు. అంబేడ్కర్ పేరుతో దళిత బిడ్డలు ప్రైవేటు పాఠశాలలో చదువుకునే అవకాశం కల్పిస్తూ టీడీపీ బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకాన్ని అమలు చేస్తే.. దానిని జగన్ ఎత్తి వేశారన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పథకానికి తన పేరు పెట్టి రాజ్యాంగ నిర్మాత కన్నా తానే గొప్పోడని చెప్పే ప్రయత్నం చేశాడరన్నారు. టీడీపీ ప్రభుత్వం దళితులకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తే.. 200 యూనిట్లు ఇస్తామని చెప్పిన జగన్ సాకులు చెప్పి అనేక మంది దళితులకు ఉచిత కరెంట్ అందకుండా చేశారన్నారు. వైసీపీ హయాంలో ఎందరో దళిత బిడ్డలకు చిత్రహింసలు పెట్టడంతోపాటు పొట్టన పెట్టుకున్నారన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించి దోపిడీ చేశారని మండిపడ్డారు. దళితుల సంక్షేమానికి టీడీపీ కట్టుపడి ఉందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు శ్రీదేవి పేర్కొన్నారు.

అధికారులపై ఫిర్యాదులు

అనంతరం దళిత సంఘాల నేతలతో ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సమావేశమయ్యారు. కార్పొరేషన్ అధికారులు.. దళితులపై చిన్న చూపు చూస్తున్నారని సంఘాల నేతలు.. చైర్‌పర్సన్‌కు ఫిర్యాదులు చేశారు. రుణాల కోసం వేలాదిమంది దళితులు దరఖాస్తు చేసుకున్నా వాటి గురించి పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌కు చెందిన వివిధ ఆస్తులు ఇతర శాఖల ఆధీనంలో ఉన్నాయని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఉండవల్లి శ్రీదేవి స్పందిస్తూ దళితుల పట్ల ఎవరు, ఎక్కడ నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దళిత సంఘాలు నేతలు సమస్యలను వివరిస్తూనే ఉండవల్లి శ్రీదేవికి వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కౌముది, ఇతర అధికారులు, సిబ్బంది, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజోతి): భర్తతో గొడవపడి మండలంలోని పల్లేపల్లిలో చాముండి(21) బుధవారం రాత్రి ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పల్లేపల్లికి చెందిన నాగమ్మ కుమార్తె చాముండిని కర్ణాటకలోని కురుగోడు గ్రామానికి చెందిన చిరంజీవికిచ్చి ఏడాదిన్నర క్రితం వివాహం చేశారు. అక్క కాన్పు కావడంతో చూసేందుకు చాముండి బళ్లారికి వచ్చింది. అక్కడి నుంచి పల్లేపల్లికి వచ్చింది. ఈ నేపథ్యంలో భర్త చిరంజీవి కూడా వచ్చాడు. ఊరికి వెళ్దామని పిలిచాడు. తాను రానని చాముండి చెప్పడంతో వాగ్వాదం చేసుకున్నారు. దీంతో మనస్తాపం చెంది రాత్రి చాముండి ఉరేసుకుని, మృతిచెందింది. దీంతో ఆమె చావుకు భర్తే కారణమని అతడిని గ్రామస్థులు చెట్టుకు కట్టేసి కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని, చిరంజీవిని అదుపులోకి తీసుకున్నారు. చాముండి శవాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చాముండి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్‌బాబు తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి



మహిళ మృతదేహం

హిందూపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలకుంట గ్రామంలో గుర్తుతెలియని మహిళ (40) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రొద్దం మండలం శేషాపురానికి చెందిన ఓ వ్యక్తి తూమకుంట పారిశ్రామిక వాడలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. అతడు మూడు రోజుల క్రితం అప్పలకుంట గ్రామంలో తాను అద్దెకు ఉంటున్న ఇంటికి ఓ మహిళను తీసుకొచ్చాడు. రెండు రోజులుగా ఆరోగ్యం బాగోలేదని ఆమెను ఆస్పత్రికి కూడా తీసుకెళ్లాడు. ఏం జరిగిందో తెలియదుకానీ ఇంటికి తాళం వేసుకెళ్లాడు. చుట్టుపక్కలవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని సెక్యూరిటీ గార్డుకు ఫోన్ చేయగా.. స్విచాఫ్ వచ్చింది. ఇంటి తాళం బద్దలుకొట్టి చూడగా.. అందులో మహిళ అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉంది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

టపాసుల దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ (అక్టోబరు 20న) నేపథ్యంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనంతపురం డివిజన్ పరిధిలో తాత్కాలిక లైసెన్సులు పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు గురువారం ప్రకటనలో తెలిపారు. www.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందవచ్చన్నారు. నాలుగు సెట్ల దరఖాస్తులను ఈనెల 30వతేదీలోపు అందజేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల విచారణ అనంతరం అర్హత ఆధారంగా జీఎస్టీ, ఫైర్ చలానా, ఎన్ఓసీ సమర్పించిన వారికి మాత్రమే లైసెన్సులు మంజూరు చేస్తామన్నారు.

న్యూస్ బాక్స్

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానె రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం గురువారం స్థానిక బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పీఆర్సీ కమిషన్ నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో కోచ్‌లు

కదిరి అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో కదిరి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరాటే మాస్టర్ షెక్షావలి తెలిపారు. గురువారం అనంతపురంలో ఎంకెస్పోర్ట్స్ ఆకామిడీ నిర్మహించిన ఎస్‌జీఎఫ్ఐ ఫెన్సింగ్ పోటీల్లో కదిరి విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచారన్నారు. డింబుశ్రీ, పావని, వెన్నెల, విష్ణు, యశ్వంత్, ఫర్హాన్, జగదీష్, మనోహర్, రాజేష్ సత్తా చాటారన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మహమ్మద్ ఇషాక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తచెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భం గా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ చేతులమీదుగా ఉత్త మ ఉపాధ్యాయ అవార్డును మాణిక్యం మహమ్మద్ ఇషాక్ అందుకున్న విష యం తెలిసిందే. ఆయనను గురువారం మండలంలోని బండ్లపల్లి ఉన్నతపాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఎంఈఓ సోమశేఖర్ నాయుడు మా ట్లాడుతూ మహమ్మద్‌ఇషాక్ తెలుగుకవిగా పుస్తకాలు రాస్తూ సమాజ శ్రేయస్సుకోసం పాటుపడుతున్నారని కొనియాడారు. రాష్ట్ర అవార్డుతో ఇషాక్‌కు మరింతబాధ్యత పెరిగిందన్నారు. అనంతరం ఆపాస్ జిల్లా అధ్యక్షుడు అమరా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తనకంటే ఉన్నతస్థానంలో ఉండాలని కోరుకునే ఉపాధ్యాయుడు ఇషాక్ అన్నారు. పాఠశాల హెచ్ఎం కడియాల మల్లికార్జున, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శాంతి, భాస్కర్‌చంద్ర, సర్పంచ్ రూప్లానాయక్, నాగలక్ష్మి పాల్గొన్నారు.



మారుతీకుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తనకల్లు(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతపల్లి ఆదర్శప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన మారుతీ కుమార్‌ను ఎస్టీయూ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసే మారుతీకుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం ఆనందించతగ్గ విషయమన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు, లక్ష్మీప్రసాద్, జాఫర్, ఎన్‌వీఎన్ ప్రసాద్, శ్రీనివాసులు, జగదీష్, నాగేంద్ర, సుందర్‌సుకుమార్, మోహన్, దామోదర్‌నాయుడు, రామక్రిష్ణయ్య పాల్గొన్నారు. కరువు భత్యం, మధ్యంతర భృతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్‌కు..



రాళ్లపల్లి షరీఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకులు రాళ్లపల్లి షరీఫ్ రాష్ట్ర నూర్‌బాషాకార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. గురువారం టీడీపీ నాయకులు మార్కెట్‌రహీం, రవూఫ్, గవ్వల నారాయణస్వామి, గంగారపు రవి, రాజ్‌కుమార్ నాయుడు, ధనుంజయ్ నాయుడు, చిలకల ఫక్రుద్దీన్ డైరెక్టర్‌తో కేక్‌కట్ చేయించి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. పార్టీ కోసం కష్టకాలంలో కూడా పనిచేసినందుకు పార్టీ గుర్తింపు నిచ్చిందని నూతనంగా ఎంపికైన రాళ్లపల్లి షరీఫ్ అన్నారు. తన ఎంపికకు సహకరించిన టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అగ్రికల్చర్ డైరెక్టర్‌కు..



క్రిష్ణమూర్తిని సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

కదిరిఅర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ అగ్రికల్చర్ డైరెక్టర్‌గా నియమితులైన బంగారు క్రిష్ణమూర్తిని హిందూపురం వాల్మీకి సంఘం నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఆయన నివాసంలో శాలువ, పూలమాలతో సత్కరించి శుభకాంక్షలు తెలిపారు. సంఘం నాయకులు వెంకటరమణప్ప, సూర్యనారాయణ, లోకేష్, సునీల్ పాల్గొన్నారు.

డ్రైనేజీలు అస్తవ్యస్తం

- రోడ్లపైనే మురుగునీరు
- దుర్వాసనతో గ్రామస్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. దీంతో రోడ్డంతా దుర్వాసతో వెదజల్లుతోందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. నాగలూరు గ్రామంలో ఇళ్లమధ్యనే మురుగునీరు నిలిచాయి. డ్రైనేజీలో నీరు పారక ఎక్కడిక్కడ స్తంభించాయి. మురుగునీరు పారక రోడ్డుపై ప్రవహిస్తోంది. దుర్వాసన భరించలేకున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. దీనికితోడు దోమలు అధికమై అల్లాడుతున్నామని రాత్రివేళాల్లో నిద్ర కూడా కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిగిచెర్ల గ్రామంలో రహదారిపై నీరు నిల్వఉండటంతో అడుగువేయలేని దుస్థితి నెలకొంది. మంచినీటి కొళాయిలు వద్ద మురుగునీరు నిలిచి తాగు నీరు కలుషితమవుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. డ్రైనేజీల్లో మురుగునీరు ఎక్కడిక్కడ నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమలు అధికమవుతున్నాయన్నారు. దోమలతో విష జ్వరాలబారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సీజనల్ వ్యాధుల ప్రబలుతున్న దృష్ట్యా దోమలు ఉత్పత్తి కాకుండా చర్యలు తీసుకోవాలని, కనీసం బ్లీచింగ్ చల్లాలని ప్రజలు కోరుతున్నారు. మండల అధికారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేయించి మురుగునీరు రోడ్డుమీదకు రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నాగలూరులో ఇళ్ల మధ్యనే నిలిచిన మురుగునీరు



చిగిచెర్లలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు
-వెంకటేష్, డిప్యూటీ ఎంపీడీఓ, ధర్మవరం

గ్రామాల్లో డ్రైనేజీలు పరిశుభ్రం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాం. గ్రామాల్లో విషజ్వరాలు రాకుండా దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేపడతాం.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కదిరిఅర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు నరసారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 13, 14తేదీల్లో విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్ర మహాసభల్లో మాజీ శాసనమండలి సభ్యులు, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరువుతున్నట్లు చెప్పారు. మహాసభలో సంఘం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదంచేయాలని కోరారు.

వైద్య కళాశాలలపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

కదిరి అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కాలేజీలను ప్రయివేటీ కరణ నిర్ణాయాన్ని వెనక్కు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యకాలేజీలను ప్రయివేటీకరణ చేయడం అన్యాయమన్నారు. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. ప్రయివేటు విద్యా సంస్థల్లో వైద్యవిద్యను అభ్యసించాలంటే రూ.లక్షలు కట్టాల్సి వస్తుందన్నారు. అంపావతిని గోవిందు, హరిప్రసాద్, పుల్లన్న దేవేనాయక్, గంగన్న, నారాయణస్వామి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా పోలప్ప

కదిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తలుపుల ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్నతాధికారులు పోలప్పను నియమించారు. గురువారం ఆయన తలుపుల ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నజీమా దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో పోలప్పకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

జగన్‌కు ఇంకా బుద్ధిరాలేదు: టీడీపీ

కదిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించినా, ఇంకా అతని బుద్ధి మారలేదని టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి వల్లెపు సోముశేఖర్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో జగన్ రాక్షసపాలనను అంతమొందిచ్చి, కూటమికి అధికారం కట్టపెట్టారన్నారు. వైసీపీ కనీసం ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలు భూస్థాపితం చేశారని గుర్తు చేశారు. అయినా జగన్‌కు బుద్ధిరాలేదన్నారు. సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చానాయుడు యూరియా సరఫరా చేయనందుకు బావిలో దూకాలని చెప్పడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చౌకబారు మాటలు మానాలని సూచించారు.

డీలర్లతో సమావేశం

గాండ్లపెంట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డీలర్ల సమావేశం తహసీల్దార్ బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చౌకధాన్యపు దుకాణాల్లో పంపిణీచేస్తున్న నిత్యావసర వస్తువులు 1 నుంచి 15వతేదీవరకు పంపిణీ చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. 28వ తేదీన ఆర్డీవో కార్యాలయంలో ఈపాస్ మిషన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నూతన ఈపాస్ మిషన్లు అందిస్తారన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ వాణి, ఆర్.జాఫర్‌ఖాన్, డీలర్లు బాబు, నరసింహారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ బారిన పడొద్దు: ఎక్సైజ్ సీఐ



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ చంద్రమణి

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ చంద్రమణి అన్నారు. స్థానిక పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా, నిల్వ, రవాణాచేసినా నేరంగా పరిగణిస్తామన్నారు. ఇందుకు పదేళ్ల జైలుశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. కొందరు యువత తెలిసి తెలియని వయసులో డ్రగ్స్‌బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున మాట్లాడుతూ జీవితం ఒక బహుమతి మాదక ద్రవ్యాల కోసం దానిని వృథా చేసుకోవద్దన్నారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞచేయించారు. సూపరింటెండెంట్ అనిల్, జూనియర్ సహాయకులు చాంద్‌బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



ప్రభుత్వాస్పత్రికి దుప్పట్లను అందజేస్తున్న స్పందన ఆస్పత్రి వైద్యులు సోనియా

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రి అయినా మరుగుదొడ్లతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలకు సగం వైద్యసేవలు అందించినట్టేనని స్పందన ఆస్పత్రి వైద్యురాలు సోనియా అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రికి స్పందన ఆస్పత్రి వైద్యులు బషీర్, సోనియా రూ.60వేలు విలువ చేసే 200 దుప్పట్లను సమకూర్చారు. వీటిని డాక్టర్ సోనియాతోపాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ నరసింహులు, గుండా పుల్లయ్య, రాధమ్మ, ఇతర వైద్యులతో చేత పంపిణీ చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు నజీర్, హరిశ్రీనివాసులు, నితిన్, ముక్తియార్, వైష్ణవి, చంద్రిక, శివప్రసాద్‌నాయక్, ఏఓ భాస్కర్, స్పందన ఆస్పత్రి మేనేజర్లు బాబాఫక్రుద్దీన్, దిల్‌దార్ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ముదిగుబ్బ ఎస్ఐ ప్రసన్న

ముదిగుబ్బ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర, బాలికల పాఠశాలల్లో పోక్సో యాక్ట్ 2012పై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సెలర్ శివలత, ముదిగుబ్బ ఎస్ఐ ప్రసన్న, బత్తలపల్లి సీడీపీఓ సరస్వతి మాట్లాడుతూ పోక్సో, బాల్య వివాహాలు చేస్తే శిక్షకు గురవుతారని, బాల బాలికలు చెడు దారిన పట్టకుండా విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎంఈఓలు వెంకటాచలపతి, రమణప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇసుక సరఫరాలో పారదర్శకత పాటించాలని ఆర్డీఓ మహేశ్ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...ఇసుక సరఫరా వ్యవస్థలో అదనపు చర్యలను అమలు చేసి సరఫరా నిర్వహణను మెరుగుపరచడం, వినియోగదారులకు సులభంగా సేవలు, పారదర్శకత అందించడంతోపాటు అవసరమైన మార్గదర్శకాలను వివరించారు. సమావేశంలో తహసీల్దార్లు సురేశ్‌బాబు, భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం ఆరోగ్య కార్యకర్త ఇందిరమ్మ ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా పరీక్షలు నిర్వహించారు. రక్తం శాతం పరిశీలించారు. అనీమియా, రక్తనాళాల్లో ఇరుకున్న సికిల్ కణాలు, సాధారణ ఎర్ర రక్త కణాల గురించి వివరించారు. ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులున్నారు.

రైతులకు యూరియా పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మం డలంలోని అల్లాపల్లి సచివాలయంలో గురువారం రైతుల కు సహకార సంఘం చైర్మన్ బోయపల్లి శివారెడ్డి, ఏఈఓ నయాజ్, యూరియాను అందించారు. రైతుల ఇబ్బందులను గుర్తించి సబ్సిడీతో అధించిన యూరియాను ప్రభుత్వం రైతులకు అందించినట్లు తెలిపారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

డాబాలు, టీకేఫ్‌ల తనిఖీ

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న డాబాలు, టీ కేఫ్‌లను సీఐ గురువారం రాత్రి తనిఖీ చేశారు. డాబాలు, టీకేఎఫ్‌లలో ఎవరైనా కొత్తవ్యక్తులు, అనుమానితులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. అదేవిధంగా రాత్రి 10గంటలకంతా మద్యంషాపులు, హోటల్స్, టీకేఫ్‌లు బంద్ చేయాలని సీఐ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజల ప్రశాంతతకు భంగం కల్గిస్తే ఉపేక్షించేప్రసక్తేలేదన్నారు.

రణభేరిని జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కదిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యా య సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టే రణభేరిని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులుశ్రీనివాసులు, తాహేర్‌వలీ, సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఎమ్మార్సీలో పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నూతన ప్రభుత్వం వచ్చి 15నెలలు గడుస్తున్నా ఒక్క డీఏ ఇవ్వలేదన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. 29శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. 15నుంచి 19వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నటు తెలిపారు. రమేష్, ఖాజాపీర్, బ్రహేంద్ర, నజీర్, సుధాకర్, రమణనాయక్, మనోహర్, బాలాజీనాయక్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

నకిలీ జాబ్‌కార్డులపై కమిషనర్ సీరియస్

● విచారణకు ఆదేశం


GOVERNMENT OF ANDHRA PRADESH
OFFICE OF THE COMMISSIONER OF PANCHAYAT RAJ AND RURAL DEVELOPMENT

కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి పథకంలో నకిలీ జాబ్‌కార్డుల వ్యవహారంపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ సీరియస్ అయ్యారు. ఇటీవల ఉపాధి పథకంలో నకిలీ జాబ్‌కార్డులతో సొమ్ము కొల్లకొడుతున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన కమిషనర్ నకిలీ జాబ్‌కార్డుల ఏరివేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని నకిలీ జాబ్‌కార్డులపై విచారణచేసి, సమగ్ర నివేదిక అందించాలని ఏపీఎస్ఎస్ఏటీ డైరెక్టర్‌కు సూచించారు. ఇప్పటివరకు నకిలీ జాబ్‌కార్డుదారులకు ఎంత చెల్లించింది. ఎంత రికవరీ చేసింది. ఇందుకు బాధ్యులు ఎవరన్న విషయంపై సమగ్రంగా విచారించి నివేదికలు ఇవ్వాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి, నకిలీ జాబ్‌కార్డుదారుల గురించి విచారించాలని తెలిపారు.

వేళకు రాని బస్సులు.. విద్యార్థులకు ఇక్కట్లు



బస్సుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

గాండ్లపెంట, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): కదిరి పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు వేళకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కదిరిలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉదయం 8 గంటలకే వెళ్లాల్సి ఉంది. గాండ్లపెంటతోపాటు పలుగ్రామాలనుంచి వందలాది మంది విద్యార్థులు చదువుకోవడానికి కదిరికి వెళుతున్నారు. వీరందరూ ఆర్టీసీ బస్సు పాసులు తీసుకున్నారు. అయితే బడి వేళ్లలకు బస్సులు రాకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ అధికారులు స్పందించి సమయానికి బస్సులు నడపాలని విద్యార్థులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయలు

బత్తలపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని టోల్‌గేట్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. కల్లూరుకు చెందిన ఓబన్న బుధవారం అనంతపురంలో జరిగిన సీఎం సభకు వెళ్లాడు. సభ ముగిసిన తరువాత కదిరి బస్సు ఎక్కడు. బత్తలపల్లి దాటిన తరువాత బస్సులోని వారు గమనించి విచారించగా అతనికి మాటలు రాకపోవడంతో బత్తలపల్లి టోల్‌గేట్ వద్ద దించేశారు. కదిరి నుంచి ద్విచక్రవాహనంలో వస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ నరసింహులు ద్విచక్రవాహనాన్ని ఆపేందుకు వెళ్లి ద్విచక్రవాహనంపై పడ్డాడు. దీంతో ఇద్దరూ కింద పడి గాయపడ్డారు. వీరిని హైవె అంబులెన్స్‌లో ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి వెళ్లి విచారించగా ఓబన్నకు మాటలు రావని తెలుసుకుని ఓబన్న ఫొటోను గుర్తు తెలియని వ్యక్తికి గాయలు ఆచూకీ చెప్పలేక పోతున్నాడని వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశారు. ఫొటోను గుర్తించిన కుటుంబ సభ్యులు బత్తలపల్లి పోలీసులను సంప్రదించారు. వారు స్టేషన్‌కు రావడంతో పోలీసులు ఓబన్నను అప్పగించారు.

పాముకాటుతో మహిళ మృతి



సరోజమ్మ (ఫైల్)

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళనాయునిపల్లి గ్రామంలో ఓ మహిళ పొలం పనులు చేస్తుండగా పాముకాటుకు గురై మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చలపతి భార్య సరోజమ్మ(56) పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటువేయడంతో ఆమె అస్వస్థతకు గురయ్యారు. అక్కడే ఉన్న కుటుంబికులకు విషయం తెలిపింది. వారు హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆమె భర్త చలపతితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

నల్లమాడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రవారిపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నరసపు క్రిష్టప్ప (55)రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. వారం రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రం కడతాల్ వద్ద కారు ఢీకొన్న ప్రమాదంలో క్రిష్టప్ప తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం కర్నూల్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. క్రిష్టప్పకు భార్య గౌరమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి ర్పించారు.

మాజీ వైస్ చైర్మన్‌పై చీటింగ్ కేసు

కదిరి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, మరో ముగ్గురిపై గురువారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కుటాగుళ్ల గ్రామానికి చెందిన జంగాల లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, మంజునాథ్, ఈశ్వరయ్య ఎర్రగుట్టపల్లి ఉన్నజగనన్న కాలనీలో ఇంటి పట్టా ఇప్పిస్తామని రూ.75వేలు తీసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. మరికొంతమంది వద్ద రూ.4.80 లక్షలు తీసుకున్నట్లు చెప్పారు. పట్టాలివ్వకుండా మోసం చేశారని, అడిగితే బెదిరిస్తున్నారని తెలిపారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

పార్సిల్ సూపర్ వైజర్‌పై..

కదిరి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ పార్సిల్ సర్వీస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్ అనే వ్యక్తి కొరియర్ పార్సిల్‌కు సంబంధించిన రూ. లక్ష 80వేలు తీసుకుని కనిపించకుండాపోయినట్లు పార్శిల్ సర్వీస్ బ్రాంచ్ మేనేజర్ షేక్ సాదిక్ గురువారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. మోసం చేసిన విజయ్‌కుమార్‌పై కేసు నమోదుచేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

గొర్రెల దొంగలపై..

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలలో 9వ తేదీన అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 6 గొర్రెలు, 2 అపహరణపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. గూడ్స్ షెడ్ కొట్టాలకు చెందిన మండ్లి గంగాధర్ వ్యవసాయం చేసుకుంటూ, గొర్రెలు, ఎనుములు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 9వతేదీన సాయంత్రం 8 గొర్రెలు, 2 పొట్టేళ్లను గంగాధర్ తన ఇంటి పక్కన ఉన్నషెడ్‌లోకి తోలి మెడపైకి వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి గొర్రెల అరుపులు వినిపించకపోవడంతో గంగాధర్, భార్య చూడగా గుర్తు తెలియని దొంగలు గొర్రెలను బొలేరోలోకి ఎక్కిస్తుండగా గంగాధర్ గట్టిగా అరుస్తూ షెడ్‌లోకి వెళ్లిచూడగా అక్కడ 6 గొర్రెలు, 2 పొట్టేళ్లను అపహరించి వెళ్లిపోయారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు సంతలలో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గంగాధర్ ఫిర్యాదు చేశాడు. వీటి విలువ రూ.70వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

దానిమ్మ రైతును ఆదుకోండి

● మంత్రిని కోరిన యువరైతు



దానిమ్మ కాయలను మంత్రికి అందజేస్తున్న యువరైతు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దానిమ్మ రైతులను ఆదుకోవాలని భార్గవ్‌కుమార్, నారాయణస్వామి మంత్రి సవితను కోరారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి సాగుచేసిన పంట చేతికొచ్చే సరికి గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు చవిచూస్తున్నామని మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో కోతకు వచ్చిన దానిమ్మ కాయలను మంత్రి సవితకు అందించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా రైతు భార్గవ్‌కుమార్ మాట్లాడుతూ గత యేడాది కేజీ రూ.120 ఉండేదని, ఈఏడు అమాంతంగా రూ.80 నుంచి రూ.60కి ధర పడిపోయిందన్నారు. ఏడాదిపాటు కూలీలు, ఎరువులు తదితర ఖర్చులు పెట్టుకున్న తమకు అమాంతం ధరపడిపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందన్నారు. హార్టికల్చర్ ద్వారా దానిమ్మసాగు రైతులను ఆదుకునేలా చూడాలని కోరారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సవిత వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ రామక్రిష్ణప్ప, మాధవనాయుడు, నరసింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కాణిపాక బ్రహ్మోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

పెనుకొండ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాణిపాక బ్రహ్మోత్సవాల్లో స్థానిక ప్రగతి గ్లోబుల్‌జెన్ విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలో ప్రతిభచాటినట్లు కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 14 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కూచిపూడి, భరతనాట్యంలో ప్రతిభ కనబరిచారని, శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణస్వామి వేషధారణలో భక్తులను ఆకట్టుకున్నారన్నారు.

సమావేశం వాయిదా

రొళ్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు స్థానిక ఎంపీడీఓ నాగేశ్వర్‌శాస్త్రి తెలిపారు. తదుపరి సమావేశాన్ని ఈనెల 23కు నిర్వహించడం జరుగుతుందన్నారు. 11మంది ఎంపీటీసీలు ఉండగా ఒకరు మాత్రమే హాజరు కావడంతో కోరం లేక వాయిదా వేసినట్లు తెలిపారు.

నానో యూరియా వాడకంపై అవగాహన

రొద్దం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నానో యూరియాను రైతులు ఏవిధంగా వాడాలనే విషయంపై వ్యవసాయాధికారి రాజేష్ అవగాహన కల్పించారు. గురువారం రొద్దం మండల పరిధిలోని తురకలాపట్నం, కోగిర ఆర్‌ఎస్‌కెలలో రైతులకు అవగాహన కల్పిస్తూ నానో యూరియా వాడకంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం ఉంటుందన్నారు. ఎకరానికి లీటరు అవసరం అవుతుందని లీటరు ధర రూ.220మాత్రమేనన్నారు. యూరియా బస్తా ధర రూ.300ఉందన్నారు. కోగిర, తురకలాపట్నం గ్రామాల్లో రైతులు నానో యూరియావాడకంపై క్షేత్రస్థాయిలో డెమో కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ హంసవేణి, ఆర్ఎస్‌కె సిబ్బంది భానుశ్రీ, నవనీశ్వర్, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, తిమ్మయ్య, శ్రీనివాసులు, భాష, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెం విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

హిందూపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్ రెడ్ రన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎస్ఎస్‌పీఆర్ విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రగతి గురువారం అభినందించారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాల్సిఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ సీఈఓ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ సీఈఓ కవిత పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుట్టూరులో సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయసేవా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు సమాజంలో జరుగుతున్న విషయాలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై దుర్గాశక్తి సొసైటీ అధ్యక్షురాలు లక్ష్మమ్మ వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అసోసియేట్ రవళి, గౌరీ, మహాశక్తి సీఈఓ రమేజ, లక్ష్మీదేవి, ముంతాజ్, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



విద్యుత్ స్తంభానికి దగ్గరగా వెళ్తున్న లారీ

రొద్దం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం ఉండటం ప్రమాదకరంగా మారింది. గ్రంథాలయం ఎదురుగా విద్యుత్ స్తంభం రోడ్డుకు దగ్గరగా ఉండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంటోందని. ఎన్నో ఏళ్ల నుంచి విద్యుత్ స్తంభం ఉండగా సిమెంటు రోడ్డు వెడల్పు చేశారు. అయితే విద్యుత్ శాఖాధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు విద్యుత్ స్తంభాన్ని మార్చలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెండువైపులా ఒకేమారు వాహనాలు వస్తే స్తంభానికి ఆనుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని అంటున్నారు. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అనేకమార్లు విద్యుత్ స్తంభం మార్చాలని విన్నవించినా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకున్న పాపానపోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని మార్చాలని కోరుతున్నారు.

చెత్త అంచనాలో పొరపాటు..!

యార్డులో 56 టన్నులే ఉందని ఏజెన్సీ అంచనా

ఆ నిల్వలకే టెండరు ఖరారు.. పనులు ప్రారంభం

మొక్కల కింద పేరుకుపోయిన నిల్వలతో సమస్య

ఇంకోసారి టెండరు పిలవక తప్పని పరిస్థితి



చెత్తను తరలిస్తున్న యంత్రాలు

హిందూపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాల నుంచి పేరుకుపోయిన చెత్తను తొలగించడం ఏజెన్సీకి భారంగా మారింది. పట్టణంలోని డంపింగ్ యార్డ్‌లో చెత్తను గాంధీ జయంతి నాటికి శుభ్రం చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. చెత్త నిల్వలను ప్రైవేట్ ఏజెన్సీ సరిగా లెక్కించకపోవడంతో టెండర్ దక్కించుకున్న సంస్థకు భారంగా మారింది. డంపింగ్ యార్డులో 56 వేల టన్నుల చెత్త ఉందని ఏజెన్సీ అంచనా వేసింది. కానీ ఏపుగా పెరిగిన మొక్కల కింద భారీగా ఉన్న చెత్తను గుర్తించలేకపోయింది. ప్రభుత్వానికి 56 వేల టన్నులే ఉన్నట్లు నివేదిక ఇవ్వడంతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టును దక్కించుకున్న సంస్థ పనులను ప్రారంభించింది. 'చెత్త అంచనా' కారణంగా గాంధీ జయంతి నాటికి యార్డును ఖాళీ చేయడం కష్టసాధ్యంగా మారింది. గుర్తించని చెత్తకు వెంటనే టెండర్లు పిలిస్తే జనవరినాటికైనా హిందూపురంలో డంపింగ్ యార్డు ఖాళీ అవుతుంది.

40 శాతమే ఖాళీ..

గాంధీ జయంతి నాటికి డంపింగ్ యార్డ్‌లో 40 శాతం చెత్త మాత్రమే ఖాళీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. చెత్తను సర్వేచేయడానికి వచ్చిన ప్రైవేట్ ఏజెన్సీ 56 వేల టన్నులు మాత్రమే ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం ఇప్పుడు సమస్యగా మారింది. హిందూపురం డంపింగ్ యార్డ్‌ను శుభ్రం చేసేందుకు తరుణి అసోసియేట్ సంస్థ టెండర్ దక్కించుకుంది. రెండు నెలలుగా మూడు భారీ యంత్రాలతో పనులు చేయిస్తోంది. ప్లాస్టిక్, ఇతర ముడివస్తువులు ఎరువులా తయారైంది రాళ్లు, ఇనుప కడ్డీలు, గాజుపెంకులను వేరు చేసే యంత్రాలు నిరంతరం పనిచేస్తున్నాయి. ఇప్పటి వరకు 23వేల టన్నులు చెత్తను బయోమైనింగ్ చేశారు. మిగిలిన చెత్తను అక్టోబరు 2నాటికి ఖాళీ చేస్తామని తరుణి సంస్థ ప్రతినిధులు అంటున్నారు. అయినా 50నుంచి 60వేల టన్నుల చెత్త అలాగే ఉండే అవకాశాలు ఉన్నాయి. చెత్తను లెక్కించేందుకు ప్రైవేట్ ఏజెన్సీ డ్రోన్‌ను వినియోగించింది. సుమారు 60శాతం చెత్తపై మొక్కలు ఏపుగా పెరగడంతో వాటిని గుర్తించలేకపోయారు. దీన్ని తొలగించేందుకు మరోసారి టెండర్‌కు పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితిని బట్టి తమకు నష్టాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తరుణి ప్రతినిధులు అంటున్నారు. ప్లాస్టిక్ వేస్ట్‌ను కడపకు సిమెంటు ఫ్యాక్టరీలకు తరలించాల్సి ఉందని, ఎరువును రైతులు తీసుకెళ్లలేదని, దీన్ని వేరే ప్రాంతానికి తరలించాలని అంటున్నారు. దీంతో రవాణా ఖర్చులు పెరుగుతాయని అంటున్నారు.

నాలుగు దశాబ్దాల చెత్త

మోతుకపల్లి సమీపంలో డంపింగ్‌యార్డ్‌కు సుమారు నాలుగు దశాబ్దాలుగా చెత్తను తరలిస్తున్నారు. మొదట్లో ఆరడుగుల కాంపౌండ్‌వాల్‌ను చుట్టూ ఏర్పాటు చేశారు. కానీ చెత్తమాత్రం 15 అడుగులపైగా ఎత్తుకు వేస్తూ వచ్చారు. దీంతో మున్సిపాలిటీ స్థలాన్ని దాటి చెత్త ముందుకు వచ్చింది. దుర్వాసన అధికమైంది. చెత్తను తొలగించాలని చుట్టుపక్కల ప్రాంతాలవారు పలుమార్లు ఆందోళన చేశారు. ఎండాకాలంలో డంపింగ్‌యార్డ్‌లో చెత్తకు నిప్పు అంటుకుంటోంది. పరిసర ప్రాంతాలను పొగ కమ్మేస్తోంది. పరిగిరోడ్డు, మోతుకపల్లి, ముద్దిరెడ్డిపల్లి ప్రాంతావాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా డంపింగ్‌యార్డ్ తొలగించేందుకు శ్రీకారం చుట్టింది. టన్ను చెత్త శుభ్రం చేసి తరలించడానికి రూ.835 ప్రభుత్వం చెల్లిస్తుంది. హిందూపురంలోని డంపింగ్ యార్డ్‌లో 49,020టన్నులకు మాత్రమే టెండర్ పిలిచింది. అయితే ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి అత్యాధునిక యంత్రాలు ఇక్కడ ఏర్పాటుచేసి తొలగిస్తున్నారు. మిగిలిన చెత్తను కూడా నిబంధనల ప్రకారమే టెండర్‌పాడి దానినికూడా తొలగిస్తే హిందూపురం డంపింగ్‌యార్డ్ శుభ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

డంపింగ్‌యార్డ్ శుభ్రం చేయడానికి ప్రైవేట్ ఏజెన్సీ టెండర్ దక్కించుకుంది. అయితే వారు 49,020టన్నులకు మాత్రమే వేలంను దక్కించుకున్నారు. అయితే మరో 50వేల టన్నులకుపైగా అలాగే ఉండే అవకాశం ఉంది. గతంలో అంచనావేసిన ఏజెన్సీ కొంత భాగం వదిలేసినట్లు తెలిసింది. దీంతో మరోసారి అంచనావేయించి ప్రభుత్వానికి నివేదిస్తాం. అంతా పూర్తిగా తొలగిస్తేనే డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం అవుతుంది.

- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, హిందూపురం

డంపింగ్ యార్డ్ పరిశీలన

హిందూపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మోతుకపల్లివద్ద చెత్తను తరలించే ప్రక్రియను మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ టెండర్ దక్కించుకున్నవిధంగా అక్టోబరు2 నాటికి ఇచ్చిన టార్గెట్ పూర్తిచేయాలని సూచించారు. మిగిలిన చెత్త ఎంతుందనేది దానిపై అంచనా వేయించి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దానిని కూడా శుభ్రంచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీరివెంట కౌన్సిలర్ రాఘవేంద్ర, చంద్రమోహన్, హరి తదితరులు ఉన్నారు.



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

కొండను తవ్వి ఎలుకను పట్టారు

708 ఉపాధి పనులు.. రూ.11.45 కోట్ల ఖర్చు

సామాజిక తనిఖీలో తేలిన అవినీతి రూ.49,788



ప్రజావేదికలో పనుల వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో సామాజిక బృందం సభ్యులు కొండను తవ్వి ఎలకను పట్టారు. బుధవారం పట్టణంలోని వెలుగు కార్యాలయం ఎదురుగా ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, సామాజిక బృందం ప్రొసైడింగ్ అధికారి ఏపీడీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఉపాధి పనులపై 18వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫాం నిర్వహించారు. 2024-25ఆర్థిక సంవత్సరంలో వివిధ పనులపై డీఆర్‌పీలు సామాజిక తనిఖీలో వెల్లడించారు. 708 పనులకుగాను రూ.11,45,64,587 ఖర్చు చేయడం జరిగిందన్నారు. కూలీలకు మెటీరియల్, ఫారంపాండ్స్, పించన్ గృహాల కోసం వివిధ పనుల కింద ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చుచేశారు. ఈనెల 2 నుంచి ఎస్ఆర్‌పీ భాస్కర్ ఆధ్వర్యంలో 11 మంది డీఆర్‌పీలు మండలంలోని 11 పంచాయతీల్లో ఇంటింటా కూలీలు, ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారన్నారు. అడదాకులపల్లిలో రూ.4670, దుద్దేబండ రూ.4500, గోనిపేట రూ.1800, గుట్టూరు రూ.3442, రాంపురం రూ.8621, శెట్టిపల్లి రూ.5935, నాగలూరు రూ.3500, మావటూరు రూ.3825, మునిమడుగు రూ.5625, వెంకటగిరిపాళ్యం రూ.4850, కురుబవాండ్లపల్లి రూ.3వేలు కేవలం రూ.49,788మాత్రమే అవినీతికి పాల్పడినట్లు ప్రజావేదికలో స్టేట్‌రీసోర్స్ పర్సన్ భాస్కర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీలక్ష్మీ, శివారెడ్డి, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, ఏపీఓ సంజీవరెడ్డి, జయమ్మ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులు

పెనుకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలం ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో గోపాల్ అధ్యక్షతన, జిల్లా అధ్యక్షుడు, ఎన్నికల అధికారి కోడూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. గౌరవాధ్యక్షులుగా కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడిగా గోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్, జిల్లా కౌన్సిలర్‌గా రామాంజినేయులు, వెంకటేశులు, చంద్రశేఖర్, గోనుకుంట మధు, రఘునాథ్, అరుణాదేవి, మల్లిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ రఘునాథ్‌రావు, రామాంజినేయులు, చంద్రమౌళి హాజరయ్యారు.

అడ్వెంచర్ కోర్సులో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి చక్రి

పెనుకొండ, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్‌సీసీ విద్యార్థి చక్రి నేషనల్ ఇనిస్టిట్యూట్‌ఆఫ్ మౌంటెనిరింగ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ వారు నిర్వహించిన స్పెషల్ అడ్వెంచ్ కోర్సులో పాల్గొని ప్రతిభ చాటినట్లు వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, ఎన్‌సీసీ అధికారి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆగస్టు 26నుంచి సెప్టెంబరు 4వరకు అరుణాచల్ ప్రదేశ్‌లో దిరాంగ్‌లో నిర్వహించిన పోటీల్లో చక్రీ పర్వతారోహణం, జిప్లైన్, టెంట్ పించింగ్, స్టీల్ క్రాసింగ్ తదితర కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ కనబరచారన్నారు. ఈ కోర్సుకు రాష్ట్రం నుంచి ఐదుగురు విద్యార్థులలో చక్రి ఒకరు కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. శిక్షణ పూర్తీచేసుకుని తిరిగి వచ్చిన చక్రీని కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

మున్సిపల్ కార్యాలయం తనిఖీ

పెనుకొండ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కార్యాలయాన్ని గురువారం అనంతపురం రీజనల్ డైరెక్టర్, కమిషనర్‌ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటెండెన్స్ తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సందడి



సమస్యలు విన్నవిస్తున్న మహిళలు

మడకశిర టౌన్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ విజయవంతంతో నాయకుల ఇళ్ల వద్ద సందడి వాతావరణం నెలకొంది. గురువారం మడకశిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమలతిప్పేస్వామిలతో పాటు నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, పలువురు మహిళలు కార్యాలయం వద్దకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. మడకశిర బ్రాంచ్ కెనాల్ పూర్తి చేసి మడకశిరకు కృష్ణజాలాలు అందిస్తానని సీఎం చంద్రబాబు ప్రస్తవించడంపై ప్రధానంగా చర్చ సాగింది. మడకశిర ప్రాంత అభివృద్ధి పట్ల సీఎం పదే పదే పేర్కొనడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సందర్భంలో పలువురు మహిళలు గ్రామాల్లోని సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

స్థలం కేటాయింపుపై రైతుల ధర్నా

పావగడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాగులో ఉన్న భూమిని శ్మశానవాటికకు మంజూరు చేయడం దారుణమని రైతులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా కార్యదర్శి హనుమంతరాయ మాట్లాడుతూ సర్వే నెంబరు 28లో బీడు భూమి అధికంగా ఉందని, అయితే రైతులు 40 ఏళ్లుగా సాగు చేసి పట్టాలు పొందిన భూమిని శ్మశానవాటికకు కేటాయించడం దారుణమన్నారు. ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు.



నిరసన తెలుపుతున్న రైతులు

ప్రారంభానికి సిద్ధంగా ఆడిటోరియం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనం

సోమందేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో కియ అనుబంధ పరిశ్రమ ఎస్ఎల్‌పీ, పేద విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన ఆడిటోరియం భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వందశాతం పనులు పూర్తికాగా త్వరలో భవనాన్ని పాఠశాలకు అప్పగించనున్నట్లు హెచ్‌ఎం జబీనాబేగం తెలిపారు. గత ఏడాది పత్రికల్లో కథనాల రావడంతో స్పందించిన ఎస్ఎల్‌పి యాజమాన్యం పాఠశాలను సందర్శించి సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆడిటోరియం నిర్మాణానికి ముందుకొచ్చారు. సీఎస్ఆర్ ఫండ్ ద్వారా ఆడిటోరియంను పూర్తిచేశారు. దీంతో త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావడానికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

సమస్యలపై వినతులు



ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న నాయకులు

సోమందేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవికి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లినట్లు ఆ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ తెలిపారు. గురువారం అనంతపురం నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ భవనంలో ఆమెను కలిసి ఉమ్మడి జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించామన్నారు. అనంతరం ఆమెను సన్మానించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని మార్చాలి

బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న బహుజన చైతన్యవేదిక నాయకులు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సమీపంలో ఉన్న మద్యం దుకాణాన్ని మార్చాలని బహుజన చైతన్యవేదిక అధ్యక్షులు శివరాంక్రిష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొద్దం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహంవద్ద మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. పదిరోజుల్లోపు మద్యం దుకాణాన్ని మార్చాలని, లేనిపక్షంలో ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, బాబు, ప్రసాద్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



ఆనంద్ (ఫైల్)

పావగడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మధుగిరి తాలూకా పోలెనహళ్లిలో బుధవారం సాయంత్రం దళిత యువకుడు ఆనంద్ (28) దారుణ హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. పోలెనహళ్లి గ్రామంలో ఉదయం బిల్ కలెక్టర్ రామకృష్ణ ఇంటి ముందు ఉన్న కొళాయి నుంచి నీరు వృథాగా పోతోంది. దీంతో ఆనంద్ అటుగా వెళుతూ నీరు వృథా అవుతోంది.. కొళాయిని ఆపండి అని చెప్పాడు. దీంతో రామకృష్ణ కుమారుడు, గ్రామ పంచాయతీ సభ్యుడు నగేష్, కుటుంబ సభ్యులు ఆనంద్‌తో గొడవకు దిగారు. సాయంత్రం ఆనంద్ తన స్నేహితులతో వస్తుండగా నగేష్ బొలెరో వాహనంతో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ నేపథ్యంలో వాహనం నుంచి దిగి తన కుమారుడిని కొడవలితో దాడి చేసి హత్యచేసినట్లు మృతుడి తల్లి లక్ష్మీదేవమ్మ పోలీసులకు వివరించారు. వాహనంతో ఢీకొట్టి యాక్సిడెంట్‌గా చిత్రీకరించారని, అయితే అందులోవాస్తవం లేదని పోలీసుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అయితే నగేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆనంద్ పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత అది హత్యా..? లేక యాక్సిడెంటా..? అనేది తెలుస్తుందని పోలీసులు తెలిపారు. కాగా డీఎస్పీ ఎస్పీ మంజునాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

దళిత సంఘాల నిరసన

దళిత యువకుడు ఆనంద్ హత్యకు సంబంధించి దళిత సంఘర్షణ సమితి (డీఎస్ఎస్) ఆధ్వర్యంలో తుమకూరు జిల్లావ్యాప్తంగా నిరసన తెలిపారు. హోంమంత్రి జిల్లాలోనే ఈవిధంగా దళితులపై హత్యలు జరుగుతుంటే మిగతా జిల్లాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ హత్యపై హోంమంత్రి చొరవ తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

'చర్యలు తీసుకోండి'

పెనుకొండ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆలూరు మండలం మానేకుర్తిలో కనకదాస విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని జిల్లా కురుబ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం నాయకులు మల్లికార్జున, నియోజకవర్గం అధ్యక్షులు నాగార్జున విలేకరులతో మాట్లాడుతూ కనకదాస విగ్రహాన్ని ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. నిందితులను అరెస్ట్‌చేయాలని డిమాండ్ చేశారు.

గౌరవ వేతనం ఇవ్వాలి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కురుబ కులస్థుల గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందించి దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాలతో నిత్యం పూజలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, అందుకు నిధులు కేటాయించాలని కురుబ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. కురుబ కార్పొరేషన్‌కు కనీసం రూ.300కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌ప్రసాద్, నాగేంద్ర, వెంకటేశులు, శ్రీనివాసులు, నంజుండ, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



లోహిత్‌కుమార్

లేపాక్షి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కొండూరు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న లోహిత్‌కుమార్ ఎంపికైనట్లు హెచ్‌ఎం శేషగిరిబాబు తెలిపారు. అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో లోహిత్‌కుమార్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.